రామాయణం

# సుగ్రీవ పట్టాభిషేకము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటీ కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

SREE VAGVALLI SERIES No. 9

శ్రీ

8284

# సుగ్రీవపట్టాభిషేకము

గూడూరు హైస్కూలులో టెక్నికల్ ఇన్‌స్ట్రక్టరు,
వరిగొండ సత్యనారాయణమూర్తిచేఁ
ప్రణీతము.

నెల్లూరు
శ్రీ వేంకటగిరి మహారాజాగారి కాలేజీ యాంధ్ర సహాయోపాధ్యాయులు
శ్రీమా[redacted] మాండూరు వేంకట రామానుజాచార్యులచేఁ
ప్రకటితము.

నెల్లూరు, ప్రభాతముద్రణాలయమున ముద్రితము.

సర్వస్వామ్య సంకలితము] శ్రీముఖ-చైత్రము. [వెల రు. 0—12—0

Vol III. No. 1.



శ్రీమాన్ కొమాండూరు వేంకటరామానుజాచార్యులుగారు.

శ్రీరస్తు.

# సుగ్రీవ పట్టాభిషేకము.

---

## మొదటి ప్రకరణము.

### దుందుభి.

కలిమిలేములు కావడికుండ' లని కాలపురుషుఁడు చాటుచున్నాఁడో యనఁ బొడుపుకొండపైఁ భానుఁ డుదయించుచుండఁ జంద్రుఁడపరదిశఁ జేరి వెలవెలఁబోవుచుండెను. కువలయపతియయ్యు దోషాకరుఁ డగుటం జేసి, చంద్రునకుఁ జేటొదవెనుగాని సూర్యుఁడుమాత్రము లోకబాంధవుఁడై నూనూఁగుమొలకయెండల నంతటఁబఱపుచుండెను. అపుడు లోకమంతయు శోభావహమైయుండెను.

అట్టి యెడ దున్నరూపముననుండు దానవుఁడొకఁ డుదధితీరముననిలిచి నింగిపగుల నార్చుచుండెను. వానియఱపులకుఁ బైనఁబోవుపక్షులు భూమిఁ గూలసాగెను. నిండఁగ్రాఁగిన యెసరుల చందానఁ బయోనిధిపొంగి పొర్లమొదలిడెను. ఆరాక్షసుఁడు గన్నుల నిప్పులుగ్రక్కుచు "ఓరీ! సముద్రుఁడా! నన్నుఁబోలినవీరుఁడు లేఁడని నీకుఁదెలియదా? నేనుదుందుభి

యనుదానవరాజును. ఎదురెందును లేనివాఁడను. దేవతలు, దానవులు, మానవులు గాలికిం దూలు తరువులవలె, నాపాదముల వ్రాలుచుందురు. ఇఁక నాభుజముల కండూతితీరుటెట్లు? ఓసాగరుఁడా! నీపేరు దశదిశలకు వ్యాపించియున్నదఁట! నీవు రత్నాకరుఁడవఁట! మొదలుతుదలు లేనివాఁడవఁట! ఇట్లు నీవు నిక్కుచుందువని చూచాయగవిని, నాకుసరియగు యుద్ధము దొరకెఁగదాయని నీతో నాలమొనరింపవచ్చితిని. నీవు నాకు రణభిక్షఁ బెట్టవలయు"నని కడలితోఁ బెనఁగయ్యమునకుఁ గాలుదువ్వుచుండెను.

వానియార్భాటములకు సముద్రుఁడు కళవళమొందెను. వానిరాపిడి కోతఁడు సహింపఁజాలకుండెను. కడ కోతఁడించుక దిటవుఁ దెచ్చుకొని మానవరూపమున వీచికలపైనిలిచి "నాయనా! దుందుభీ! నీవంటివీరుఁడు ముల్లోకములలేఁడు. నీకు గట్టిమిసాటిలేనిది. ఏడువార్ధులఁ జొచ్చి కొంపిఁగావింపఁగల వాఁడవునీవు. ఇంక నేనెంతవాఁడను? కుమారా! నీ వెక్కడ నేనెక్కడ. దంతియెక్కడ దోమయెక్కడ? నేనా, పండుముసలిని. నాయంగములా యెన్నఁడో పటుత్వము చెడినవి. దుర్బలుఁడనగునాకు వణఁకురోగము దాపురించినది. నాయనా! మును సురాసురులు నను ద్రచ్చి నాసారముఁ ఊసిరి. అగస్త్యుఁడల్లి పుడిసిటిలో నాపెంపు చెడఁజేసెను. చూచుటకు గంభీరుఁడనే కాని పిఱికిపందలలో నేను మొదటివాఁడను. కుమారా! నీకోరికయీడేరుటకు నేనొకవిషయముఁ జెప్పెదవినుము. నీవు

# సుగ్రీవ పట్టాభిషేకము.

హిమవంతు నెఱుంగుదువుకదా! ఆతఁడు కొండలరాయఁడు ధైర్యమునకుఁ బెట్టినపేరు. నిన్నుఁదాఁకి నిలువఁగలమేటి. మఱియు నాతఁడు హరునిమామ సమయమువచ్చిన మామయే గాక యల్లుఁడుకూడ నీకుఁ దృప్తిగ సమరభిక్షఁ బెట్టనోపు" నని బోధించెను. అందుల కారాత్రించరుఁడు శరధి భీతుఁడయ్యె నని భావించి "తాతా! పోయివచ్చెద. నీమేకపోతుగాంభీర్య మీనాఁటికిఁ జెల్లమైనది" యనిపలికి బయలుదేఱెను.

మదాంధులు మిన్నుమన్ను తెలియక వర్తించుచుండుట సహజము. రణకాంక్ష యారాక్షసు నంతలో హిమవంతుకడకుఁ జేర్చెను. వాఁడు రభసమొనరించుచు "ఓరీ! పర్వతరాజా! నాతోఁ బోరరమ్ము. అచలాధినాథుఁడవనియు, హరునిమామవనియు, నసమానవీరుఁడవనియు నీవువిఱ్ఱవీఁగుచుందువఁట! రమ్ము! నన్నోడించి నీపేరునిలుపుకొను" మని పలికెను. అంతం గొంతసేపటికి హిమవంతుఁడు మానవాకృతి నిజశిఖరముపైఁ గూర్చుండి యారక్కసుఁగాంచి "యోరాక్షసేంద్రా! నాకు రణవిద్య తెలియదు. నన్ను బాధింపకుము. నేనుమునులకాశ్రయుఁడను నన్నుఁదొడరుట నీకున్యాయముగాదు. నిన్నుడీకొన సరివాఁడనా?" యని నుడివెను.

మూఢుని వేడిపలుకులు చల్లనిమాటల నుపశమిల్లునా? రాక్షసుఁ డందులకు మండిపడుచు "ఓరీ! రాజనామకుఁడా! పేరుగొప్ప యూరుదిబ్బయనుట నీయందు సార్థకమైనది. చూడఁ

జూచ, లోకము లన్నియు వీరులకుగొడ్డువోయినట్లున్నవి. నా చేతులతీటవోవఁ బోరొనరింపవలయును. ఓరీ! నాయెదుట నిలువఁగలధీరు నెవనినైనఁ జూపఁగలవా?" యనిగద్దించెను. హిమవంతుఁ డాతని మాటలకు ముదమందుచు "ఓదానవోత్తమా! ఈలోకమున నిన్నెదిరి పోరాడఁజాలిన మహావీరుఁ డొకఁడుకలఁడు. ఆతని పేరువాలి. రిపుల కాతఁడు గుండెగాలము. కాన నీవుసత్వరము కిష్కింధకుఁబొమ్ము. ఆపురమాతని వాసస్థానము. ఆతఁడు మీరాక్షసకులాంతకుఁడగు దేవేంద్రుని కుమారుఁడు. కాబట్టి సమయమువచ్చినఁ గుమారుఁడేకాక, తండ్రికూడ నీకురణభిక్షఁబెట్టఁగలఁడు. ఇట్లు నీవొకబాణమున రెండుపక్షులఁగొట్టవచ్చును. నీకుశాశ్వతసౌఖ్య మొదవుఁగాక! పోయిర!" మ్మని యానక్తంచరుని దీవించి తనయామండఁడు ఫలపుష్పములసమర్పించి వీడ్కొలిపెను.

ఆరాక్షసుని పూనిక యాతనినొక్కగంతులోఁ గిష్కింధానగరద్వారముకడకుఁ దెచ్చివిడిచెను. వాఁడచటఁజేరి క్రొక్కారుమొగులువలె గర్జింపసాగెను. దుందుభిభైరవారావము లంతఃపురమున నాకిమండలమునునుండు వాలివీనులఁ బడెను. వానరాధీశుఁ డాయఱపులను జెవివిచ్చివినెను. ఆతని కపారమగు కోపముకలిగెను. కనుఁగవ నిప్పుకలురాలసాగెను. 'ఎవఁడామదాంధుఁ' డనియావనాటవరుఁడు పేరెలుఁగున నార్చుచు సింహద్వారముచెంతకుఁబరుగిడెను. తారమున్నగు

తరుణులుకూడ నాతనివెన్నాడిరి. అచట నారక్కసుఁడు కద లెడు కాటుకకొండరీతి గంతులిడుచుండెను. వాలి వానినిడాసి "యోరీ! నిశాటా! కుడిచికూర్చుండలేక, కొరవితోఁ దలఁగోకి కొనఁ గమకించుచున్నాఁడవా? నీకుజీవితాశకలదేని, తొలఁగి నీత్రోవఁబొ' మ్మనిగద్దించెను. కానియాదానవుం డాదులకుఁ గనులెఱ్ఱఁజేసి" ఓరీ! వనాటుఁడా! నీవొకపోటుబాటువోలె వని తలమొనుట లేతసారకాయలు గోయుచున్నాఁడవా? తినఁబో వు పూరాకురుచికోరు టెందులకు? నీలావును నాలావును బోరు నఁదెల్లముకాఁగలదు. అయిననునీవిపుడు కాంతాలోలుఁడవైయు న్న ట్లగపడుచున్నావు. ఈకతమున నిన్నిపుడు దునుముట యు క్తమూకాదు. మత్తుని, సుప్తుని, కాంతాసక్తుని యుద్ధమునఁజం పిన భ్రూణహత్యయందురు. కాన నీనిశయెట్లైనఁ దాల్మి దాల్చియుండెద. ఈరేయియంతయు నీవు సౌఖ్యములఁదేలుము రక్తమర్థులకొసంగుము. సుతు పీటి కథపుఁజేయుము. వేగునం తకుఁ బోరికి వెడలిరమ్ము పొ" మ్మనిగర్వోక్తులాడెను. కపీం ద్రుఁ డారక్కసునివచనములకుఁగనలి" యోరీ! దానవాధమా! ననుఁబరిహాసింప నీకుగుండెలున్నవిగా? దురాత్మా! నీకురణ మున ధీమసముగలదేని యొక్కింతతడవుండుము. చెట్టుచెడు కాలమునకుఁ గుక్కమూతిపిందెలు పుట్టునట్లు, నీకుఁబోఁగాల మాసన్నమగుటంజేసియే, నీబుద్ధి పెడతలఁబట్టి నిన్నిట్లుకూయిం చుచున్నది. నిన్నుఁగాలుసన్నిధికి గెంటివైతును" రమ్మని

దుందుభిగతి మ్రోయుచు దుందుభిని దాఁకెను. అప్పుడా దానవ వానరేశ్వరు లొండొరులు పోరసాగిరి. వారిసింహనాదము లావరించుచుండిరి. కాలుదెబ్బల రువ్వుకొనుచుండిరి. చెట్లచేతులఁ గొట్టుకొనుచుండిరి. ఇట్లురాను రాను రాక్షసునిబలము తఱుఁగుచుండెఁ బురందరనందనుని బలోత్సాహ మినుమడించుచుండెను. కడకావనచరవరుఁడా రక్కసుని గ్రిందఁద్రోసి, తాను మీఁదనై వానిని నాలుగేల మర్దించెను. వానివాలముఁ బిడికిటఁ బట్టి గిరగిరఁద్రిప్పి నేలఁగొట్టెను. ఆరాక్షసుని ముక్కునఁ జెవుల నెత్తురోలుకి వాఁడు పూచిన మోదుగువలె నయ్యెను. కాలుకేలు కదల్చుటకైన వానికి శక్తి చాలకపోయెను. అప్పుడు వాలి పటపటఁ బండ్లుగొఱుకుచు "పలుగాకి! నీకుఁదగినశాస్తి యైనదా!" యనియఱచుచు, వాని కళేబరమును దవ్వులఁబడునట్లు కాలఁ జిమ్మెను. అది సాలికవోలె నెందో యెగిరిపోయెను. విజయవిరాజితుఁడగు వానరనాథునిఁ గపులగ్గించిరి.

అచటికి యోజనమాత్రదూరమున నొకతపోవనము గలదు. అయ్యది వివిధములగు వృక్షములతో లతలతో నందనవనమును మించి చెన్నారుచుండెను. అందలి ఫలవృక్షములు క్రిందికివంగి యోగ్యుఁడగు ధనాధికుఁ దలపించుచుండెను. వానిపైఁగొన్ని కపులు కాయగసరులమెసవుచుఁ బొట్టపోసికొనుచుఁ దిరుఁగాడుచుండెను. పలువిధములగు పులుగులు చూపఱ నేత్రానంద మొనరించుచు నీయెడ నాయెడకుఁ బాఱు

చుండెను. అందొక సరోవరముకలదు. దానిగట్టులంగల చెట్ల నీడల సింహశాబకములు, హరిణడింభకములు, వ్యాఘ్రరాజములు, గోమాతలు స్వజాతివైషమ్యములవీడి సహజస్నేహమున మెలఁగుచుండెను. అచట మతంగుఁడను మహాముని యొకఁడు లతాకుటీరమును నిర్మించుకొని తపముచేయుచుండెను. ఆఋషీంద్రుఁడు తపోనిధియనియు, శమదమాది సద్గుణములు కలవాఁడనియు, సత్యసంధుఁడనియు నమోఘవచనుఁడనియుఁ బేరొందియుండెను. ఆమునిచంద్రుని తపోమహిమం జేసియే, యాయాశ్రమము శాంతినికేతనమై తనరారుచుండెను. ఆమునిరాజు శాంతప్రధానమునుబట్టి యాయాశ్రమమునఁ బులులుపిల్లులై, హరులు హరిణములై చరించుచుండెను, మహాత్ముల కసాధ్యమేమికలదు? ఒకయెడ నొకచెట్టునీడ గోవొకటి నిలచియుండఁ బులిపిల్లయొకటి దానిఁజేరి పొదుగునఁబాలుగుడుచుచుండెను. ఆయావుప్రేమమీర నావ్యాఘ్రడింభకమును నాఁకుచుండెను. మతంగమహామునియచట నిలిచి ప్రేమవిలోకనముల నాయపూర్వదృశ్యమును జూచుచు నావుమెడ నిమురుచుండెను, ఆమహర్షి మోమున దివ్యానందము తోలు కాడుచుండెను. ఇట్లుండ నాతనికి దబాలుమను సడి వినన య్యెను. ఎక్కడనుండియో నెత్తురు బొట్టులు వాయువశమున నామునీంద్రునిపైఁబడెను ఆ భీకరశబ్దమునకు గోవుకలతపడి అంకెవైచి విదలించుకొనిపోయెను. పులిపిల్లవేఱొకయెడ

కుంబఱచెను. ఆ సంయమి కోపమునకుఁ బరిమితిలేకపోయెను. ఈ రక్తబిందువు లెక్కడివి? ఎవ్వఁడింతపనిఁ జేసినాఁడు. దుష్టుఁడుకానిదే, ధర్మహీనుఁడుకానిదే, శాంతజీవన మొనరించు మాయట్టియతుల తపమును భంగమొనరించునా యని గర్జించుచు నాతం డడవిదిక్కులన్నియుఁ బరికింపసాగెను. ఒకయెడ నాశ్రమాంతికమునఁగొండ చందమున గతాసుఁడై కూలియున్న మహిషరూపదానవుఁ డా మౌనివరు కంటఁబడెను. ఆ మహర్షి తన విజ్ఞానమునఁ గలయుదంతము నంతయు నారయఁగల్గెను. శాంతనిధియయ్యు వాలి దుండగముల కామహనీయుఁడు క్రుద్ధుఁడయ్యెను. అతని ముఖాంబుజము జేవురించెను. దృష్టిజాలముల నిప్పులు కుఱియసాగెను. "ఏదురాత్మునిచే నాయాశ్రమము దానవశవముచేఁ గప్పఁబడియెనో, ఏదోన్మత్తునిచే నామేను మహిషాసురునెత్తుటఁ దడిసెనో, ఏపాపచిత్తుచే నీపావనవిపినము నేఁ డపవిత్రమయ్యెనో, యట్టి దుర్బుద్ధివాలి నేఁడు మొదలు నిమ్మహావనమునకు, నీకొండకడ కెన్నఁడేని వచ్చిన యెడల నప్పుడే చచ్చుఁగాక! మఱియు నీయాశ్రమమునందెప్పుడును వాలియనుచరులుందురు. వారందఱొండొకదిక్కునకుఁ బోవలయును. పోకున్నఁ జచ్చునట్లు శపింతును. మఱియు నెవ్వఁడైన వాలితోఁ గలహించి యిచట వసియించెనేని యతనికా వాలివలని వెఱపు లేకుండుఁగాక! ఇప్పటినుండియు వాలిసచివులెవ్వరైన నాకంటఁబడినచో, శిలలౌదురుగాక"

యనియామునీశ్వరుఁ డతిదారుణముగ శపించెను. ఆశాపమును వినినవానరులు తమస్వామికడకుఁబరుగు పరుగునఁబోయి "దేవా! ఏమనివిన్నవింతుము! మీరు కాలంజిమ్మిన దుందుభికాయము మతంగాశ్రమమునఁబడినది. దానికా ఋషీంద్రుఁడు కనలె"నని శాపక్రమమును దెలిపిరి. వెంటనే వానరాధిపుఁ డళుకుఁజెంది మునిదరిసన్నిధికిఁబోయెను. అచట నొకపులిచర్మముపై నామునీంద్రుఁడు కూర్చొని యేమియో యాలోచించుచుండెను. వాలివినయమునునాతని చరణములవాలి యంజలిఘటించి నిలిచి "మునినాథా! దాసునితప్పులు దండముతోసరికదా! బిడ్డలుచేసినతప్పులఁ దండ్రులొప్పులని భావింపవలయుఁగదా! మూఢుఁడనగు నాకేమి తెలియును కాన నన్నుగరుణించి శాపమోక్షమునుగ్రహింపుఁ"డని వేఁడుకొనెను. కాని యామునిరాజు వానరరాజునాదరింపక యాశ్రమములోనికిఁబోయెను.

వాలి యుక్కఁజేయునదిలేక "నేనొకటితలచిన దైవము వేఱొకటితలంచెను! నాకర్మఫలమునాపైమేకదా!" యని యనుకొనుచు వచ్చినదారిఁబోయెను.

# రెండవ ప్రకరణము

## మాయావి.

“అయ్యో! నాన్నా! ఈ యకాలమరణము నీ కెక్కడ దాపురించెను? అకటకటా! ముప్పదేండ్లు సాముచేసి మూల యింటి ముసలమ్మచేతఁ జచ్చినట్లు సురాసురులకు సైతము తేఱిచూడరాని నీవంటి పరాక్రమశాలి సామాన్యుఁడగు కోతుల రాజుచే నీల్గుటఁజూడఁ గొండలుమునిఁగి గుండులు తేలిన చందమైయున్నదిగదా! ఆహాహా! నా నెత్తురుడుకుచున్నది. నామెదడు మండుచున్నది.........మాటల సందడిలోఁ గిష్కింధను బాయు టరయనైతి” యని యొక్క రక్కసుఁడు గగనము పోటుగట్ల గర్జించుచు వచ్చుచుండెను. గిరి జరిగి వచ్చుగతి నడచు నాపురుషుని యార్పులకు బెగడొంది, చెట్లపై సుఖసుషుప్తిఁ జెందియుండు పులుగులు తపతప ఱెక్క లల్లార్చుచుఁ గావుకావని పై కెగయుచుండెను. కాలాంతకుని వలెనుండు నాయసుర మిడి గ్రుడ్లు కొఱవులభంగి మండుచుండెను. మదాంధుఁడగు నా దైత్యునిఁజూచి నవ్వుచున్నాఁడోయ న, జాబిల్లినడుమింటఁ జేరి వెన్నెలలఁ గ్రుమ్మరించుచుండెను.

కిష్కింధను జేరుకొలఁది యాదానవునకు భీతికలుగ సాగెను. వానిమది కీడును శంకింప మొదలిడెను. భీతచిత్తము వెనుక కీడ్చుచున్నను బాహుపాదములు వానిని ముందుకు

లాగుచుండెను. "నేనెంత మందమతిని! బలిగృహమునకుఁ జను మేకపోఁతుకేతి, నేను కిష్కింధకుఁ బోవుచున్నాఁడఁగదా! ప్రాణములున్న బలుసాకుఁ దిని బ్రతుకవగును. నిజమారయ, నేనెక్కడ? వానరాధిపుఁడెక్కడ? రక్షోధిపుఁడగు రావణాసురునంతవానినిఁ జంకలనిరికించుకొని నాల్గుసముద్రములఁ ద్రిప్పిన వాలితో వైరమునకుఁ గడంగుటకంటె మిన్నయగు తెలివిమాలినతన మేమికలదు?.........ఛీ ఛీ నేనిట్లు కొంవల మందనేల?" యని యారాక్షసుఁడు గుండెకు దిటవు వెచ్చుకొని దుర్గద్వారమును సమీపించెను. అప్పటికి నడురేయియైయుండెను. ద్వారరక్షకులు నిలుచుకొనియే కునుకుపాట్లుపడుచుండిరి. ఆ నిశాటుఁడు పిల్లియడుగుల వారిం జేరి యొకదెబ్బతో వారింజంపి, విజయోన్మాదమున దిక్కురులదరునట్లు బొబ్బిలిడెను. వానియార్పులు కోటయంతయుఁ బ్రతిధ్వనికలిగెను. ఈ యకాల గర్జనములకుఁ బౌరులు బెగడొందిరి. నిజసతియగు తారతోఁ బూసెజ్జఁ బవళించియుండు వాలికీ యఱపులు మెలఁకువఁదెచ్చెను. అతఁడులేచి బారుగాఁ జెవులిచ్చి వినెను. "ఓరీ! వీరమ్మన్యుఁడా! ఓరీ! కోతులరాయఁడా! నాకు రణభిక్షఁబెట్టుము రమ్ము! నిన్నుఁ బరలోకమునకుఁ బంపెద, ర!" మ్మనుపలుకులు లాతని చెవులకు ములుకులయ్యెను. "రణభిక్షకాదురా! మరణభిక్షఁబెట్టెద

నుండు " మని యాతఁ డఱచుచు ఱివ్వుఱివ్వున సింహద్వారము వైపు పోసాగెను.

పురవీథులన్నియుఁ గలఁగిన యుదధివోలెనుండెను. పౌరులు బమ్మెరవోయి దిక్కులు తెలియక, పళ్ళెరములోని పాదరసముపగిది నీయెడ కాయెడకుఁ బఱచుచుండిరి. వానర స్వామినిజూచినతోడనే వారి ప్రాణములు కుదుటఁబడెను. "మీరుపొండు, భయపడకుఁ డాయసురుని వధించివచ్చెద " నని యాతఁడు వారికి ధైర్యముఁజెప్పెను. పౌరులు హృదయభారములను దింపుకొని వెనుకకుఁబోయిరి. 'ఎవఁడా దురాత్ముఁడు? ఏవఁడామదాంధుఁడు? ఎవనికిఁ గాలము మూఁడినది? ఎవఁడువాఁ' డని వాలి ఘోషించుచుఁ బోవుచుండెను. ఇంతలో నాతనికి సుగ్రీవుఁడెదురై 'యన్నయ్యా! యీ యలబలమేమి? ఈభీమరవము నింగిని భేదించుచున్నది. వాఁడెవఁడైయుండు? ' నని వాలినడిగెను.

'ఎవఁడో కాలముతీరినవాఁ ' డని వాలి నిలువక పోవుచుండెను. సుగ్రీవుఁడాతని వెంబడించెను. అంతలో వారు పురద్వారముఁజేరిరి. కాలాంతకులవలెనుండు నాయన్నదమ్ములను దవ్వులగాంచి, యారక్కసుఁ డుక్కుదక్కి యాకంపించుచుఁ గాలికి బుద్ధిసెప్పసాగెను. " ఓరీ! దానవాధమా! ఇదియా నీమగతన " మని వారా దానవుఁ దరుముచుండిరి; వెన్నెల పిండియారఁబోసినట్లు కాయుచుండెను. అట్లాదనుజుఁడు ముం

దును వారువెనుకను నెంతోదూరము పరుగెత్తుచుండిరి. రోష
వివశులగు నాసోదరులు రక్కసు నుక్కడఁగింపఁ దమక మొం
దుచుండిరి. ఇంతలో నారాక్షసుఁడు చూచుచుండఁగనే యొక
బిలమునఁబడి మాయమయ్యెను. వాలిసుగ్రీవులట్లే విభ్రాంతు
లైనిలిచిరి. "అన్నా! వీఁడు మాయావిగానున్నాఁడు. మన
కనులయెదుటనే మాయమయ్యెను. ఇపుడు మనమేమి చేయ
వలయు?" నని సుగ్రీవుఁడడిగెను.

"తమ్ముఁడా! వీఁడు నిజముగా మాయావియే. వీని పేరుకూడా మాయావియే. వీఁడా దుందుభి కుమారుఁడు పగను మనసున నిడుకొని, కసితీర్చుకొను నుద్దేశమున నేఁడు మనపైకి వచ్చినాఁడు."

"అన్నయ్యా! ఇంతకును వీఁడదృష్టవంతుఁడు నీపిడికిటఁ బడిన ప్రాణికి మఱి బ్రతుకెక్కడిది?!"

"సుగ్రీవా! వీఁడిపుడు మాయమయ్యెనని భీతిల్లకుము, ఈబిలద్వారమునఁ గాచియుండుము. నేను లోనికిఁబోయి, రాక్షసుని వధించి, గెల్పుసిరితోఁ దిరిగివచ్చెదను. అందనుక నీవిచట నుండుము."

"అన్నయ్యా! ఆమాయావి సార్థకనాముఁడు. కడిమి గలుగువాఁడు. ఏమో! ఏవేళ యెట్లున్నదో యెవనికెఱుక? నేను గూడ నీవెంటవచ్చెదను. ఈవరమనుగ్రహింపుము"

"తమ్మయ్యా! భయమెట్టిదో యెఱుఁగని నీవిప్పుడు

భయపడుచున్నావేల? నాపౌరుషమునే శంకించి దిగులుపడుచున్నావా? రాక్షసాధిపుఁడగు రావణునంతవానికే బుద్ధిఁజెప్పిన నాకు—గంధర్వరాజగు గోలభుండంతవానిఁ బీచమడఁచిన నాకు—యీపనియెంతపాటిది? గుడినిమ్రింగినవానికి గుడిలోని లింగమొకలెక్కయా? నీవీ బిలద్వారమునఁ గాపుండుము. పోయివచ్చెద" నని వాలి బయలుదేఱెను.

సుగ్రీవుండన్నకుఁ బ్రదక్షిణించి వినయాంజలియై "యన్నా! పోయిరమ్ము! విజయశీలివై తిరిగిరమ్ము! అందాఁక నేనిచట నీకింకరుఁడనై యుండెదను. నీకు శుభంబగుఁగాక!" యని యాతని వీడ్కొలిపెను. వాలి బిలము సొచ్చి పోయెను.

కాలమునకుఁ గలవేగము మఱిదేనికిని లేదు. క్షణములపై నిమిషములు, నిమిషములపై ఘడియలు, ఘడియలపై దినములు దినములపై మాసములు విరామములేక దొర్లిపోవుచుండెను. వాలి శాసనానుసారము బిలముచెంత సుగ్రీవుఁడుండెను.

ఆతనికి దినమొక యేఁడుగానుండెను. ఉమ్మలికను కాలవ్యవధి నోర్వఁడుగదా! రేయింబవళ్లు నిద్రయెట్టిదో యాతఁ డెఱుఁగఁడు. ఎన్నాళ్ళకును వాలి పోవడి యాతనికిఁ దెలియదయ్యెను. సుగ్రీవునకు దిగులుపుట్టెను. ఆతఁడు శంకాకులుండయ్యెను. పాడుయోచన లేమేమియో యాతని మదిం గలఁచుచుండెను. అప్రయత్నముగా నాతనికన్నుల నీరు కాఱసాగెను.

అకటా! నాయగ్రజుఁ డేమాయెనో కదా! ఆమాయావి చేతుల మడిసియుండునా? ఏక్షణమున నెట్టి పాడువార్త నా చెవులఁబడనున్నదో! అయ్యో యొ్యా! నేనేల నాయన్నను వెంబడింపనైతిని? అకటకటా! నాకిపుడేది వెఱవు? నాసోదరుని రక్షించుకొనుట కుపాయమేమి? ఒంటిమై నేను నగరమునకుఁ బోవ, హనుమంతుఁడు, జాంబవంతుఁడు మున్నగుమంత్రులు 'మీయన్నయు మాస్వామియునగు వాలియేఁడీ?' యనియడుగ నేను వారికేమని చెప్పఁవాఁడ? ఆహా! యెంతటిదుర్దినము! ఆమాయావి రానేల? మమ్ములనాజకిఁ జీరనేల? మేము వాని నంటిరానేల? వచ్చితిమిపో నాయగ్రజునొంటిమై బిలములోనికి నేను బంపనేల? ఓమృత్యుదేవతా! నాయన్నబలాఢ్యుఁడు, నీకుఁ బ్రియసఖుఁడు, ఏలయాదువా? ఎన్నియోమారులు నీ కతఁడు కడుపునిండఁ గూడుపెట్టియున్నాఁడు. ఆమహాత్ముని యెడఁ గృతజ్ఞతాబుద్ధిఁ బ్రకటించుట నీవిధియైయున్నది." యని పాపము! సుగ్రీవుఁడు పరిపరివిధములఁ బొక్కుచుండెను.

ఇట్లు బిలముచెంత నాలోచనానిమగ్నుఁడై కూర్చుండి యుండిన సుగ్రీవునిపాదముల కేదియో వేడిగాఁదగిలెను. ఆతఁడులికిపడి లేచెను. గుహాద్వారమునుండి నెత్తురు నురుగులు గట్టి పాఱుచుండెను. సుగ్రీవుని కన్నులుపచ్చనయ్యెను. ఆతని ప్రాణము లేయెడకో పోయెను. దానికిఁదోడు, లోనుండి

భయదాట్టహాసములు వినరాసాగెను. ' అయ్యో! యనుకొని నంతయైనది' యని యాతఁడు వెఱ్ఱికేక వేసెను.

శోక మాతనిఁ బైకొనుచుండెను. ' అయ్యో! యన్నయ్యా! రాక్షసుని మర్దించివత్తువని నేనింతదనుక వేచియుంటిని. కాని నేనిపుడు నిర్భాగ్యుడనైతి' నని యాతఁడు పలవించుచుండ నాభీకరారావము లంతకంతకు సమీపింప మొదలిడెను ఆయార్పులువినుట కాతని గుండె లవియుచుండెను. ' అకటా! నాయన్నను వాలిని వధించుటతోఁ బోక, యాదానవుఁడు ఘోషించుచు నాపైకివచ్చుచున్నాఁడు, తప్పించుకొనుట కేదిదారి?" యని సుగ్రీవుఁ డాకసముఁ జూడ మొదలిడెను. కడ కాతఁడు పక్క నుండు కొండశిఖరమును బెల్లగించి యాబిలమువాతవైచి "యిఁక నామదాంధుఁడు మాయావి బయటరానోపఁ" డని యనుకొనుచు నట నుండిపోయెను.

## మూడవ ప్రకరణము.

---

### పరాభవము.

సుగ్రీవుఁడు మెల్లగాఁ గిష్కింధఁ జేరెను. చేరుటయే తడవుగాఁ బౌరు లాతనిఁజుట్టుకొని 'యువరాజకుమారా! నీముఖము వన్నె వాసియున్న దేల? మాస్వామి వాలి యెక్కడ?' ననితలకొకతీరున నడుగసాగిరి. పాపము సుగ్రీవునినోట మాటరాదయ్యెను. ఆతనికన్నులనీరు కాల్వలుగట్టి పాఱుచుండెను. సాఖ్యోదంతములకంటె శోకవార్తలకు గమనమెక్కుడేమో! వాలిమరణ మంతలో నంతఃపురమునకుఁ బ్రాకెను. నల నీల తారాదిమంత్రుల కా ఘోరవృత్తాంతము తెలిసెను. అందఱును సుగ్రీవునిఁ గలిసికొనిరి. కిష్కింధయంతయు నల్లకల్లోలమయ్యెను. వధాకథనమును వినిపింప సుగ్రీవునకు నోరాడినది కాదు. కాని మతిమంతుఁడగు హనుమంతుఁ డాయలబలము నడఁచి 'యువరాజా! ఏలదుఃఖించెదవు? మనవలనఁ గాఁగలదేమికలదు. అంతకు దైవమున్నాఁడు. కల యుదంతమును ఋన్నతమాని తెలియఁజేయు' మనెను. పావనియూఱడింపులకు రవిసుతుఁడు దిటవుఁదెచ్చుకొని 'యా మాయావి మాయన్నను దనపొట్టఁబెట్టుకొనినాఁ' డని చెప్పలేక చెప్పి బావురుమని యేడ్చెను.

దుఃఖమునకుఁ బట్టువిడుపులున్నవి. నేఁడుండు దుఃఖము రేపుండదు. వాలివధ నాలించి యాబాలగోపాలము పరితపించిరి. ఇట్లు నాలుగైదుదినములు గడచెను. మంత్రుల యుపదేశమున సుగ్రీవుఁ డన్నకుఁ దిలోదకములు విడిచెను. వాలి యాత్మకు శాంతి కలిగినదని యందఱు సంతసించిరి.

రాజునుబట్టి రాజ్యము. రాజులేనిరాజ్యము కట్టుదిట్టములతో నుండదని, మంత్రులయా దాలోచనలు పుట్టెను. వాలికుమారుఁ డంగదుఁడు పసివాఁడు; అతఁడు సింహాసనమునకుఁ దగఁడని వారు తీర్మానించిరి. సుగ్రీవుఁడు శోకమును నిగ్రహింపఁ పట్టాభిషేకమునకు సిద్ధపడఁ జనునని వారు నిర్ధారణ సేసిరి. అమాత్యుల నిర్ధారణము సుగ్రీవునకుఁ దెలిసెను. వానికది నచ్చలేదు కాని మంత్రులాతనిం జేరి "ఓయువరాజా! ఇదినీకుఁ దెలియని ధర్మమా? వాలివెనుక వానరరాజ్యము నీయదికదా! పోయినవారితో నుండువారును బోవుదురా? మాకోరికను మన్నించి మమ్ముఁ బాలింపు"మని ప్రార్థించిరి. చతురులగు మంత్రులమాటయందు సుగ్రీవునకుఁ గొంతయాచితి గన్పట్టెను. వారిమనవుల నాదరించుట యుచితమని యంతరాత్మ యాతనికిఁ జెప్పుచుండెను. మౌనమర్ధాంగీకారముగదాయని మంత్రులభిషేక సన్నాహము లాచరింపసాగిరి.

ఇఁక నచట గుహాద్వారము. వాలియాదానవుని పుత్రమిత్ర సమేతముగాఁ బరలోకమునకుఁ బంపి బయటికిరాఁ బయ

త్నించెనుకాని పోవునపుడు గ్రుడ్డివెలుఁతురుతో నుండిన మార్గ మిపుడు కాఱుచీఁకటితో నుండుటకుఁగల కారణ మాతని కర్థమైనదికాదు. కన్నుపొడుచుకొన్నను చెన్నుకానరాద య్యెను. 'సుగ్రీవా! దారియేది! ఎక్కడనున్నా' వని యాతఁడు పలువిధములఁ బిలువసాగెను, ప్రత్యుత్తరములేదు, ఆతనికోపము మిన్నుమన్ను గ్రమ్మఁగఁగలంతదైయుండెను. కడ కాతఁడెట్లో ద్వారమును జేరెను. చూడఁగా నది శైల శిఖరముచేఁ గప్పఁబడియుండెను. రోషావేశమున నాతం డప్రాణిఁ బగులఁదన్ని యీవలకువచ్చి సుగ్రీవునికొఱ కంతయు వెద కెను గాని యాతఁడగపడఁడయ్యెను. అంతనాతఁడు కాలాగ్ని రీతిఁ గనలుచు "ఔరా! సుగ్రీవా! ఇంతద్రోహమతివైతివా! నాచావుఁగోరి బిలమువాత శిలనుంచితివా! వానరరాజ్యమును నిరాటంకముగ నేలనెంచితివా! ఓకీ! కప్పకూఁతపామా! నీకీ చమడఁ చెదనుండుము. తెల్లనివన్నియుఁ బాలని నల్లనివన్నియు నీళ్లని నమ్మి మోసపోయితి" ననిగర్జించుచుఁ బోవుచలిడెను.

ఆతని సర్వాంగములు నెత్తుటఁబడిసి దుమ్ముచేనిండి యుండెను. మార్గమధ్యమునఁ గొలనొకటి కాన్పింప నద్దానఁ గ్రుంకు లిడనెంచి యాతండద్దాన దిగెను. జలకమాడి గట్టు కెక్కునప్పటి కచట నొకదివ్య దంతావళము నిలిచియుండెను. అది వెండికొండఁ బోలియుండెను. దానిపై దివ్యపురుషుఁ డొకఁడు కూర్చొనియుండెను. సహస్రభానుతేజుఁడగు నాపుణ్యా

మూర్తి యుత్తమాంగమున మణిమయకిరీటమును విపుల వక్షోభాగమునఁ బారిజాతమాలికయు నలరారుచుండెను. ఆపురుషోత్తముని వదనాంబుజము సుప్రసన్నమై కలకలలాడుచుండెను. వానరేశుఁ డామహామహుఁ గాంచుటయే తడవుగా భక్తిమెఱయ సాగిలఁబడి యాతనిఁ గొండాడెను. ఆదివ్యపురుషుఁడు వాలిఁజూచి "కుమారా! నేను దేవేంద్రుఁడను. దేవదానవులకు గుండెగాలమైయుండిన మాయావి మదమణఁచి మాకు సంతసము నించితివి; విజయ విరాజితుఁడవగు నిన్ను దీవించి, బహూకరింపవచ్చితి" నని కమ్మోక్తులాడెను. వాలి యంజలిగీలించి వినయముతో నిలిచియుండెను. సురేశుఁడు మందహాసమొనరించుచు నొకహారము నాతని కొసఁగి "పట్టీ! ఇది కాంచనమాల, దీనిని ధరించి కయ్యమొనరించిన యెడలఁ బగవాని బలపరాక్రమములు సగభాగము నిన్నుఁజేరి నీకు విజయముం గూర్చు" నని యంతలోఁ దిరోధానుఁ డయ్యెను. వాలి యాహేమ దామమును ధరించి కపురయమునఁ గిష్కింధకుఁ బోయెను.

పురపరిసరములయందే యాతనికి మంగళవాద్యములు జయజయారావములు వినవయ్యెను. ఆతని మదికింతయు వచ్చెను. ఆకీశేశుని కోపానలజ్వాలలు మింటికంటెను. 'ఏమీ! ఆకృతఘ్నునకు సుగ్రీవునకుఁ బట్టాభిషేకము జరుగుచున్నదా! ఎట్లు జరుగునో చూచెదఁగాక యని బిరబిరఁబోయి, యొక్క—

గంతులోఁ గొలువుకూటమునఁ బ్రత్యక్షమైనిలిచెను. అప్పటికి సుగ్రీవుఁడు సింహపీఠినధిష్ఠించియుండెను. అచ్చరల మించిన మచ్చెకంటు లిద్దఱు వింజామరలు వేయుచుండిరి. కొలువు కూటము వివిధాలంకారములతోఁ గన్నుల పండువైయుండెను. మంత్రులు, సామంతులు, పురోహితులు, సేనానులు సముచితాసనములఁ గూర్చుండియుండిరి. పుణ్యాంగనలు మంగళ హారతులిచ్చుచు గీతములఁబాడుచుండిరి. కెంపారుకన్నులతో-క్రోధభాషణాకారముతోఁ దడాలున వచ్చిన వానరనాయకుని వాలిని జూచినతోడనే సభ్యులు విభ్రమాత్ములైరి. వాలియో వాలిప్రేతమో వారు నిర్ణయింపలేకుండిరి. లేకున్నఁ జచ్చిన వాలి మరల బ్రతుకుటెట్లు?

సుగ్రీవుఁ డింతలోఁ గలయుదంతము నూహించెను. అన్ననుజూచిన యాతం డమందానందమందెను. సింహాసనము దిగి యాతఁడన్న పదముల కెఱఁగి 'యన్నయ్యా! దైవమువందనీయుఁడు పగతునిఁ బరిమార్చి కుశలివై పురముఁజేరి మాకానందముఁ గూర్చితివి. నీరాక నాకు యానందము. నీకపిరాజ్యమును నీవుకైకొను' మనివినయమునఁ బలికెను. కాని వాలికాప్రార్థనములు చెవిటివానికి శంకూదినట్లయ్యెను. 'కైలాటకాఁడా! ఈ బొల్లిమాటలు బుల్లియేడుపు లెన్నడునేర్చితివిరా! దురాత్మా! మోసము ముందుకు వచ్చునను కొంటివా? దుర్జాతా! పామునకుఁ బోలువోయు విషమెక్కునట్లు నీయెడ

నాయుపకారములన్నియు నపకారములైనవి, యని గద్దించెను. కాని సుగ్రీవుఁ డతివినయమున 'నన్నయ్యా! నేనుపైలాటకాఁ డఁగాను. దురాత్ముఁడను, దుర్జాతుఁడనుగాను. నీయానతి మెయి నేనుబిలమువాత వేచియుంటిని. అంతఁగొంతకాలమునకు దానినుండి నెత్తురుపరలసాగెను. నేనుభయమంది, దానికడ్డముగ గిరిశిఖరమునిడి కిష్కింధఁజేరితిని. అన్నయ్యా! నేనెంతవలద న్నను, మానక మంత్రులు నాకుఁ బట్టముగట్టిరి. ఇంతలోనీవు నువచ్చితివి. ఇదిగో! నీబంగారుగద్దియ. ఇదిగోనీరాజముద్రిక.' యనిచెప్పెను. ఆవినయభాషణములన్నియు వాలియెడ నిరుప యోగములయ్యెను. ఆతం డంతకంతకుఁగనలి మాయావిని తా ను వధించిన విధమునంతయు సభ్యులకువినిపించి "చూచితిరా! వీఁడు దేనెపూసినతరవారి. బిలమునఁబడి నేనుజవికిపోవలయు ననితలంచి, దానికడ్డముగఁ బెద్దబండనుంచినాఁడు, వీఁడు భ్రాతృద్రోహి: రాజద్రోహి. వీనిముఖముఁ గాంచుట మహాపాతకము. అతివినయము ధూర్తలక్షణమని వీనివర్తనము వెల్లడించుచున్నది. పాపమని యూహలుగాకిని మన్నించినచోఁ, బ్రజలకు స్వామిద్రోహమనిన మంచినీళ్ళ మర్యాదయగును. కాన వీఁడు దండనార్హుఁడు. వీనిసర్వస్వము-వీనిపత్నిరుమ-నన్నుఁ జేరుఁగాక. వీఁడుకట్టుపుట్టముతో వీఁడు వీడిపోవుఁగాక! ఓరీ! ఘాతకుఁడా! ఇదియే మాశిక్షావాక్యము; నీకుదండన" మనెను.

వాలి పరుషవచనములు సుగ్రీవునకు రోషముఁదె

చ్చెను. కాని యగ్రజుఁడు కదా యని యాతఁ డించుక శాంతిం
చెను. దారుణమగు రాజాజ్ఞను దరువ నెవ్వనికిని గుం
డెలు లేకుండెను. మతిమంతుఁడగు హనుమంతుఁడు తిన్నగ లేచి
"ఓ వానరాధిపా! నీతమ్ముఁడు నిరపరాధి; నిష్కళంకుఁడు.
ఆతఁడు నీకుఁ గీడొంచినవాఁడు కాఁడు. మేమే యాతని బలవంత
ముగఁ బట్టభద్రుఁ జేసితిమి. కోపము మానవ స్వభావమైనను,
మన్నన నైజలక్షణముగదా! కాన శాంతించి, నీతమ్ముని జేప
ట్టు" మని హితవు సెప్పెను. ఆమాటలు వాలి చెవుల కెక్కలేదు.
మీఁదుమిక్కిలి మండెడుమంటలో మఱింత నేయి వోసినట్ల
య్యెను. 'ఔరా! కాలుమెత్తనైన గుఱ్ఱము మూఁడుకాళ్ళ
నడచునట్లు, మాయందలి మంచితనము మీనాలుకలను సాగిం
చుచున్నదిగా! మాపాలనము మీకు నచ్చకున్నఁ, బోదలఁ
చినవారు వీనివెంటఁ బోవచ్చును.' అని వాలి ఖండితముగాఁ
బలికెను. వాలి యవినీతికి సామీరి కుపితుఁడయ్యెను. ఆతని
ముఖాంబుజము జేవురించెను. "ఓ కీశేశా! చెట్టు చెడుకాలము
నకే యుట్టి కుక్కమూఁతిపిందెలు పుట్టుచుండును. ఇఁక మా
కు సెల" వని హనుమంతుఁ డాతనికిఁ దెలియఁ జెప్పి "ఓయినతన
యా! రుమా! ఓ మంత్రులారా! ఓ సైనికులారా! ధర్మమునకు
జయము నిజము. ఈయన్యాయము నోర్వనివారు మావెంట
రం" డని ప్రబోధించెను. మరున్నందనుని పలుకు లుచితము
లని తోచిన కపు లాతని వెంబడించిరి. 'పీడవదలినది. గుండ్రా

ఱని దాఁచినఁ గూఁతురి పెండ్లియాగునా?' యనివాలి యంతిపురికిఁబోయెను.

---

## నాలవ ప్రకరణము.

---

### హనుమత్సందేశము.

ఋణాగ్ని శత్రుశేషముల నిలుపరాదనుట రాజనీతిజ్ఞుల సిద్ధాంతము. చిన్నపామునైనఁ బెద్దకఱ్ఱతోఁ గొట్టుటరాజులకాచారము. రాజులు నిత్యశంకితులు. గూఢచారులే వారికి లోచనములు. ఎలసపోయిన సుగ్రీవుఁ డేమిచేయుచున్నాఁడోయని, వాలి యనుక్షణము సందియమొందుచుండెను. అగ్ని, రేణువని విడిచిన నభివృద్ధి నందునని యాతనికిఁ దెలియును. తనపైఁ బగదీర్చుకొనుటకు సుగ్రీవుఁడు ప్రయత్నించుచున్నాఁడని వాలికిఁ దెలిసెను. ద్వేషము బాంధవము నెఱుంగదు. మంచిచెడ్డలఁ బాటింపదు. నిజానిజముల గమనింపదు. సుగ్రీవుని సన్నాహములనాలకించి, వాలి కనలెను. రాజానుగ్రహమును బడయనెంచిన భటులదియే యదనని గ్రహించి, రవిసుతుని ప్రయత్నములను గోరంతలు కొండంతలు చేయుచుండిరి.

"ఔనౌను. పొరపడితి' నని వాలి పెదవికఱచుకొనుచు "ఓవానరులారా! సుగ్రీవునితలను దునుముకొని వచ్చినవాఁడే నాకు నచ్చినబం" టని తీవ్రముగాఁ బలికెను.

గోడలకుఁ గూడఁ జెవులున్నవేమో! ఎట్లోయీభీకరాజ్ఞ సుగ్రీవునకుఁ దెలిసెను. బలాధికుఁడు పైనెత్తివచ్చినపుడు ధైర్యమెక్కడ? తోడనే యాతఁడు ప్రాణములఁ బిడికిటఁ బట్టుకొని, కాలుకాలినపిల్లివలెఁ బరుగిడసాగెను. కాని వాలికి, జొరరాని చోటును, సుగ్రీవునకు దాగఁదగిన స్థలమును దొరకినవికావు. ఇట్లు సుగ్రీవునకు సుఖముకఱవయ్యెను. కాలమెప్పుడొక్కతీరున నుండునా? రెండువైపుల మండుకొఱవిపై నాతండెంతకాలమని యుండఁగలఁడు? సుగ్రీవుఁడీవిధమునఁ బ్రాణముల రక్షించుకొనుటకై కొండలనక గుట్టలనక పరుగెత్తుచుండెను. వాగులనక వంకలన డాఁగుచుండెను. వాలి కరాళాకార మాతని కెల్లకడల రూపొంది నిలుచుచుండెను. సామీరి, స్వామియవస్థఁ జూడఁ జాలక "ఇనతనయా! ఏలబెగడొందెదవు? ఋశ్యమూక పర్వతము నీయునికికి యోగ్యమగుస్థానము. దానిపైకి వాలిగాని, వానియనుచరులుగాని శాపభయమున రానోపుదు" రని నుడివెను. హనుమవాక్యములు సుగ్రీవునిచెవుల సుధచిలుకరించినట్లయ్యెను. ఆతనికిఁ బట్టరాని సంతసముకలిగెను. నాఁటిసుత సుగ్రీవుఁడు ఋశ్యమూకాద్రిఁ జేరి యెదపైఁజేయిడి నిద్రింపసాగెను. ఇఁకజేయునదిలేక వాలి

యూరకుండెను. ఆకొండపైఁగల వన్యఫలమూలముల భక్షించుచు సుగ్రీవానుచరులు సౌఖ్యముగఁ గాలము వెళ్ళఁదీయుచుండిరి.

సౌఖ్యదినములయందు వడిగాఁ జనుకాలము దుఃఖసమయముల మెల్లగా జరుగుచున్నట్లుండును. నిర్భాగ్యుఁడగు సుగ్రీవుఁ డాలింగోల్పడి బంధుమిత్రాదుల మొగమెఱుంగక దినమొక యుగముగాఁ గడపుచుండెను. కాని తనసుఖదుఃఖముల సమభాగులై తన్నుఁ గాయుచుండు హనుమదాది సచివసత్తములను, తక్కుంగల వనాటవరులను జూచుకొని, యాతఁడు మొలబంటి దుఃఖమున మోకాటిబంటి సంతోషము నందుచుండెను.

ఒకనాఁ డాతఁడు ఋశ్యమూక సానువులయందుఁ గపులతోఁ దిరుగుచుండఁ గనుచూపుమేర నాతని కిద్దఱు కోదండపాణులగపడిరి. కన్నార్పక చూడగా వారు తేజోవంతులై యుండిరి. తోడనేయాతఁడు తొట్రుపడుచుఁ దనమంత్రులం గాంచి "యమాత్యులారా! యటుచూడుఁడు. ఆపంపాసరోవరముకడ నాచూతవృక్షముల నీడల నిలిచియుండు నాపురుషోత్తములఁ జూడుఁడు. వారికడఁ గాలసర్పములవంటి చాపములున్నవి. వారు కపటమునులై, వాలిపంపున నిటకు మనలఁ జంప నరుదెంచి యున్నారని నామేను కంపమొందుచున్నది. కాదేని, మునులకు ఖడ్గతూణీర ధారణమేటికి? వారివేషములు పావనములై యున్నను నాబుద్ధి కలఁగుచున్నది. ఇఁక మనమిచట నుండుట క్షేమముకాదు." అని కిచకిచధ్వను

లోసరించుచు మతంగాశ్రమము ప్రాంతకుఁ బోయెను. మిగిలినవారును సుగ్రీవుని వెంటఁబోయి పంపకడనిలిచియుండు నాపురుష శేఖరులను సారెసారెకుఁ జూచుచుండిరి కాని పవనాత్మజుఁ డాతని భయం బుడుపనెంచి "యోవానరతిలకా! వారుమహాత్ములుకాని కపటాత్ములుకారు. వారిపెంపెఱుఁగక వెఱవనేమిటికి? రజ్జుసర్ప భ్రాంతి మానుము. బాగాము లాలోచింపుము. ఇంగితబుద్ధిఁజూచిన నీకే యంతయుఁ దెలియు"నని బోధించెను. భయభ్రాంతుఁడగు సుగ్రీవున కామాటలు నచ్చలేదు. ఆతఁడు గడగడ లాడుచు "నోహనుమంతా! యేటిమాటలివి. వారుకోదండపాణులు. ఖడ్గహస్తులు. విశాలనేత్రులు. ఆజానుబాహులు. రూపొందిన సూర్యచంద్రులవలె వారు రాజిల్లుచున్నారు. వారింగాంచిన నేరికి మదితల్లడిలకుండు?"నని పలికెను. హనుమంతుఁ డందులకుఁ బిన్న నవ్వొలయ "యోకపివరా! యేమినీభ్రాంతి!

"తే. గీ. వాలిదొరయును వీర లవ్వాలిఁ గొలుచు
వారునై పంప వచ్చిన వారుగారు
వాలిఁబరిమార్చి నినురాజ్య మేలఁజేయ
వచ్చిపొడకట్టు ధర్మ దేవతలుగాని."

ఓవానరాధిపా! నేఁడు సుదినము. ఇది ఋశ్యమూకము గదా! మహర్షియగు మతంగుని దారుణశాపమునంజేసి వాలికి

వాలి యనుచరులకు దఱియరానిది. వాలిభయ మిట వాటి ల్లను. దిగులొందకు"మని ధైర్యముచెప్పెను

సుగ్రీవుఁ డామాటలకుఁ గలకఁదేఱి "యనిలసుతా! నీవు నాకుఁ బరమాప్తుఁడవు. మిత్రుఁడవు. ఉత్తమగుణశీలుఁ డవు. చాతురీ ధురీణుఁడవు. వటువేషధారివై నీవు వారలఁ గదిసి వారెచటివారలో గనుఁగొనుము. వారేటికి వివ్వనమున నిల్చిరో యారయుము. నీవుపోయి వారి లోఁ తెఱఁగెఱమ్ము. నీతి మంతుఁడవు నీకుఁ దెలియుని దేమి కలదు. పోయిర"మ్మనెను.

సుగ్రీవాజ్ఞను శిరసావహించి గాడ్పుకొమరుఁడు భిక్షు కవేషమును ధరించెను. 'శుభమగుంగాక యని సుగ్రీ వుఁడు దీవించెను. హనుమంతుం డంతఁ గొండదిగి పంపను డాసెను. అచటఁ జూతముక్రీడ నాపురుషపుంగవులు నిలిచి యుండిరి. వారిదివ్య తేజమున నాప్రదేశమంతయు వెలుఁగొందు చుండెను. వారిఁజూచిన మారుతికి దివ్యానందము కలిగెను. వినయమున సమీపించి మ్రొక్కి పురుషోత్తములారా!

"ఉ. ఎక్కడివారుమీరు జగదేకమనోహరు లుగ్రకాననం
బిక్కడి కేలవచ్చితిరి? యీజటివేషము పూననేమి? యీ
యెక్కటిజోదు బాగులు వహించితి రేల? వెలుంగఁజేయు న
ల్దిక్కులుమీశరీరపటుదీధితి-చోద్యముఁదెల్పుఁడెన్నియుఁన్."
తే-గీ. విమలమతులార! మీలక్షణములఁజూడ
నఖిలరాజ్యంబుఁ బాలింప నర్హులనుచు

డెందమునఁ దోఁచుచున్నది పొందుపడఁగ
నీజడలు వల్కలములు మీ కేలకలిగె?"

అని మధురవాక్యములనడిగెను. నీలమేఘశ్యాముఁడును కోటిమన్మథాకారుఁడును హసన్ముఖుఁడునగు వారిలో నగ్రజుఁడు తమ్మునిఁగాంచి "సౌమిత్రీ! ఈకపీంద్రుని వాక్శుద్ధిని వినయవర్తనమును గాంచితివిగదా! లక్ష్మణా! ఇట్టిబుద్ధిమంతుఁడగు సచివునిఁ గలుగని నృపాలుని కార్యము లెట్లుసిద్ధించును? తమ్ముఁడా! మనయుదంతము నీవుమహాత్మునకుఁ బూసగ్రుచ్చిన రీతి వినిపింపు" మనిచెప్పెను.

అన్నయానతి నౌదలఁదాల్చి రామానుజుఁ "డోకపీంద్రా! మేమురఘుకులులము. దశరథరాజ నందనులము. ఈమహాత్ముఁడు రామచంద్రుఁడు. సుగుణాభిరాముఁడు. విక్రమశాలి. విజయశీలి. ఆర్తశరణ్యుఁడు. నాకగ్రజుఁడు. ఈరాముఁడు జనకునిసత్యము నెఱప నాలితో నడవికేతెంచెను! అచట దుర్మదుఁడగు రావణుఁడు మము డాఁగురించి, సీతఁగొనిపోయెను. మేమెల్లదిశలు వెదకుచుఁ దిరుగుచుండ నొకనాఁడు శబరి సుగ్రీవుచరితముఁజెప్ప నాతని సఖ్యము నాకాంక్షించి మేమిటకరుదెంచితిమి. ఈరామచంద్రుఁడు ధైర్యనిధి యయ్యుఁ దనపత్నిఁదలఁచి తలఁచి శోకవారాశి చంద్రుఁడైయున్నాఁడు. నేను లక్ష్మణుఁడను. అన్నను సేవించుచు నడవికి వచ్చితిని. ఓయనఘా? నీవెవ్వఁడ?" వని యడిగెను.

సౌమిత్రిమాటలు స్వామికి సంతసమునించెను. ఓరఘువరులారా! నేనుహనుమంతుఁ డనువాఁడ. సదాగతిసుతుఁడను. కామరూపుఁడను. సుగ్రీవునకు ముఖ్యమంత్రిని. అధికతేజుఁడగు నావనాటవరుఁ డన్నవలన భార్యనుగోల్పడి రాజ్యభ్రష్టుఁడై ఋశ్యమూకముపై కపులతో నుండఁగలిగియున్నాఁడు. మీతో సఖ్యమొనరింపనెంచి నన్నుఁబంప భిక్షురూపమున మిమ్ములంఁజేరి ధన్యుఁడనైతి" ననియె.

రాము:—సౌమిత్రీ! వెదకఁబోయిన తీఁగె, కాలఁదగిలినది. సుగ్రీవుని మైత్రినాశించి మనమిచటికివచ్చితిమి. ఆతఁడును మన నెయ్యముఁగోరి పవనాత్మజుని బంపినాఁడు.

హను:—రామానుజా! సుగ్రీవుఁడిపుడు కృతార్థుఁడయ్యెను. కయ్యమునకు వియ్యమునకు నెయ్యమునకు సమతశోభించు ననునుడి మీయందు సార్థకముకాఁగలదు. మీనెయ్యమునఁగానిపను లుండవు. పరమహంసను జేరిన పాపపరుఁడు పునీతుఁడగునట్లు శ్రీరామసఖ్యము నందిన 'సుగ్రీవసాచివ్యముచే మేము ధన్యులమైతిమి.

లక్ష్మ:—(రామునితో) అన్నయ్యా! ఈకపివరుం డిప్పుడు సంతోషాంబుధి మునుకలు వేయుచున్నాఁడు. మనమిఁక సుగ్రీవుని పాలికిఁబోదము.

స్వామి సంతోషమున నుప్పొంగెను. వెంటనే యాకపివరుఁడు నిజరూపమువహించి" రఘుపుంగవులారా? నాభుజ

ములపై నధిరోహింపుఁ" డని వేఁడుకొనెను, పావని యపారానందమున రాఘవుల నంసతలముల నెక్కించుకొని సుగ్రీవుని కడకుఁబోయెను.

## ఐదవ ప్రకరణము.

### రామసుగ్రీవమైత్రి.

హనుమంతుని జాపకడకుఁ బంపిన సుగ్రీవుఁడు ఋశ్యమూకమునుండి మలయాద్రికిఁ బోయియుండెను. హితవరు లగు నమాత్యు లెన్నిసముచితవాక్యములాడుచున్నను, భయాకులచిత్తుఁడగు సుగ్రీవుఁడు కుదుటఁబడఁడయ్యెను. నీలుం డాతనిం గాంచి "యర్కజా! వారొకవేళ వాలి పంపున నీపైకి వచ్చినవారైనను, సరసవచనముల సామీరి వారినిమెప్పించి నీకు హితవుఁగూర్చును. అట్టిసచివోత్తముని గలిగియుండు భూపాలునకుఁ గాని కార్యము లుండునా?" యనెను.

అంతలో నచటికిఁ బవనజుఁడే తెంచి "భానుతనయా! నీకుశుభంబగుఁగాక! నీపుణ్యమేమందును! వాలితల రెండు పిడుగులువాలిన ట్లిద్దఱువీరు లరుదెంచియున్నారు. వారు రఘుపుంగవులు. శోకసాగరమునఁ బడియుండు నీకు రఘురాముఁడను

తెప్పదొఱకినది. ఓకపీంద్రా! ఆదాశరథి దయావారిధి. సత్య వాది. మహాభుజుఁడు. ఓయినతనయా! ఆమహాత్ముఁడు తండ్రి పనుపున వనమున కరుదెంచియుండ, నచట దురాత్ముఁడగు రావణుఁ డాతని దేవిని బ్రుచ్చిలికొనిపోయెను. ఇప్పుడా మిహిర కుల మండనుఁ డనుజయుతుఁడై నెలఁత కతన నీతోడి చెలిమి వాటింప నేతెంచియున్నాఁడు. ఋశ్యమూకమునకు వేంచేసి యున్నాఁడు. రమ్ము. పోవుదము. లె” మ్మని ప్రబోధించెను.

స్వాతివాన కెదురుచూచు ముత్యపుఁజిప్పవోలె, హను మత్సందేశమునకు వేఁచియుండు రవిసుతుఁ డాతనిపలుకుల నాలకించినంతనే యమందానంద మొందెను. ఆతనినయన ముల నానందాశ్రువులు నిండెను. “ఓమారుతీ! నాతపమెల్లఁ బండినది. నానోములన్నియు ఫలించినవి. నీయట్టి యంజనము గలుగ, నాకు రాఘవ నిధానమబ్బుట కేమిచోద్యము! నీవంటి కర్ణధారుఁడుండ, నేనీ శోకాబ్ధిఁగడచు టొకయబ్బురమా! పావ నీ! రమ్ము. మహానుభావులను సంభావించి సఖ్యమొనరించు కొంద” మని సుగ్రీవుఁడు బయలుదేరెను.

అట ఋశ్యమూకమున రాఘవులు సుఖాసీనులైయుం డిరి. సచివులతో సుగ్రీవుం డంతలో నచటికివచ్చి వారికి మ్రొక్కి ప్రాంజలియై “యోరఘుపుంగవులారా! పిచ్చుగుంటపై భాగీరథి ప్రవహించినట్లు పరమపావనులరగు మీ రీదీనునిఁబ్రోవ నిట కేతెంచితిరి. దిక్కుమాలియుండు నాకు మీదర్శనమున సంతో

షమపారమైయున్నది. ఓరామభద్రా! ఈదినమే సుదినము. నేఁడు నాకదృష్టభానూదయమైనది. ఈ యాంజనేయుఁడు దేవరదివ్యగుణముల నాకువినిపించెను. మీయం దవియన్నియు రూపొంది నాకన్నుల కానందముఁగూర్చుచున్నవి. ఓరామచంద్రా! నీతో మైత్రిచేయ నాకు మనసయ్యెఁడు. ఇదినీకు సమ్మతమేని చేముట్టి బాసనేయు" మని ప్రార్థించెను. రామచంద్రుఁ డాతని మనవులకుఁ బ్రసన్నుఁడై సకలలోక రక్షాకరములును, ఆశ్రితజన శ్రీకరములును రిపులోక భయంకరములును నగు కరములుసాచి భానుతనయుని గాఢముగాఁ బరిరంభించి "రవిసుతా! నీసాచివ్యము నాకుశుభస్కరముగదా!" యనెను.

ఇంతలో సదాగతిసుతుం డొకయెడఁ బావకుందెచ్చి నిల్పెను. రామసుగ్రీవు లగ్నిదేవునకుఁ బ్రదక్షిణించి నిల్చిరి. రాఘవుండప్పుడుప్లవగేంద్రుంగాంచి "యోవనాటవరా! మనమిఁక సమాన సుఖదుఃఖభాజనులమై స్నేహముననుందము. ఇందుల కీశిఖిసాక్షిగనుండుఁగాక." యని చెప్పెను. సుగ్రీవుండందులకు ముజ్జగమబ్బినట్లుబ్బి "యోరఘుస్వామీ!

"తే॥ గీ. రవిసుతుండ నేను; రవివంశమణివీవు
నీజయంబె తలఁప నాజయంబు,
నీపరాభవంబె నాపరాభవ మార్య
వగవవలదు మగువఁ దెగువఁ దెత్తు."

స్వామిహితులగు నానెయ్యురసాయమున నేను దివిఁ

జలమగు. ఆదుష్కర్ముఁడు రావణునకుఁ శాపమొకటికలదు. ఆతఁడు పరనారులఁ దాఁకనోపఁడు. ఒకనాఁడు రంభ నిజనాథుఁడగు నలకూబరుని యొద్దకుఁ బోవుచుండెను. త్రోవలో రావణుఁడానాతి మిన్న కెదురై తనకోర్కె నాతరుణి కెఱిఁగించెను గాని వానినామె తిరస్కరించెను. కాముకులు ముందువెనుక లరయక చెడుట సాధారణముగదా! అంత వాఁడా యచ్చరలేమను బలాత్కరించెను. రావణుని దురాగతము నలకూబరుని చెవులఁబడెను. ఆతం డంతఁగనలి "ఒల్లని వల్లవాధరలఁ జెఱుప నారావణుఁ డుద్యమించినచో, వానితల వ్రయ్యలగుఁగాక" యని దారుణముగ శపించెను. ఈ శాపభయమున వాఁడు నీదేవిం దాఁకఁడు."

"రామచంద్రా! శోకపావకుని వివేక సలిలముల నార్పుము. శోకము సుఖముం జెఱుచును. శోకము తేజము నడఁచును గాన దాలిమిఁదాల్పుము. దేవా! వయస్యభావమున నేను హితము పలుకుచున్నాఁడనేకాని, యుపదేశింపనే నెంతవాఁడను! రామచంద్రా! శోకముమాని నన్ను సమ్మానింపుము. సీతాదేవిని వెదకుభారము నాపైనిడికొని నీకు ముదముం గూర్తునని యీవఱకే మనవిచేసికొని యుంటిఁగదా!" యని సుగ్రీవుఁడు మృదుమధురముగాఁ బలికెను.

శ్రీరాముఁ డా యూఱడింపులకు సుగ్రీవుఁ గౌఁగిలించుకొని "రవితనూజా! నీహితవచనములు నావంత నంతమొం

శించినవి. నామనము కలఁక తేఱినది. నీవంటి ప్రాణబంధుని నీవంటి హితోపదేష్టను నేనిఁకఁగానను. ధనధాన్యములను! భోగభాగ్యములను, ప్రాణమానములను విడిచియైన మిత్రుని కార్యమును జక్కఁజేయుట సఖ్యవిధముగదా! ఆపత్కాలమున నుపకరించినవాఁడే మిత్రుఁడనం జనును. భానుతనయా నీవాంఛితమేమి? ఏవెరవునన్నైన, నేనద్దాని నెఱవేర్చి, నీకానందముం గూర్చెద" నని యభయమిచ్చెను.

రఘువరుని యభయ ప్రదానమునకుఁ గపికులాధీశుఁడు సంతోషాంతరంగుఁడై

"కం. తారాధిపవదనన్ రుమ
నారమణిన్ రాజ్యమున్ ధనముఁగొనె నాదు
ర్వారుఁడగువాలిఁ జనుముట
కోరిక యిది నమ్మినందుకున్ ఫలమధిపా."

అని కేలుదోయి ఫాలమున గీలించి ప్రార్థించెను. అందులకు రాఘవుఁ డాతనియెడఁ బ్రసన్నుఁడై

"తే—గీ. జగతినుపకృతి మిత్రలక్షణ మపకృతి
శత్రులక్షణములుఁ గాన సాధుచరిత
చెలఁగినీపత్ని నపహరించినదురాత్ము
వాలినివధింతు నిక్కంబు వలదుశంక."

అనిశపథ మొనరించెను.

రామచంద్రుఁ డమోఘవచనుఁడని యందఱకుఁదెలి

యును. కపులు హర్షించిరి. హనుమంతుఁ డధికసంతోష మొందెను. ఆభక్తవరుని నేత్రము లానందబాష్పములఁ గురియుచుండెను. "రఘుస్వామీ! నీతోడి చెలిమి రుద్రేంద్రులకు సైతము దుర్లభమైయుండ, రవినందనుని పుణ్యముసంజేసి యాతనికది యబ్బినది. దేవా! నీవుభక్తవిధేయుఁడ వనుటకిదియొక నిదర్శనముకదా! రఘువీరులారా! లెండు. తియ్యని పండ్లనుదిని యించుక విశ్రమించుఁ"డని యాకపిశేఖరుఁడు వేఁడికొనెను. హనుమ వేఁడికోలు నంగీకరించి రామ లక్ష్మణు లాతనివెంటఁ బోయిరి. సుగ్రీవాదులు వెంబడించిరి.

—::—

## ఆఱవ ప్రకరణము.

---

## వైరానుకథనము.

ఆనాఁడు ఋశ్యమూకాద్రిపై నానందమారుతము వీఁచుచుండెను. జనానురంజకుఁడగు ప్రభుని సుఖదుఃఖముల యందుఁ బ్రజలు పాల్గొనుట సామాన్యముగదా. ఎల్లర మోముదమ్ములు సంతోషమున వికసించియుండెను. రామ సుగ్రీవమైత్రి కెల్లరు మోదమందియుండిరి.

ఋశ్యమూకమునకుఁ జుట్టుపట్లనుండు ఋషులకు రా

మాగమనమును సుగ్రీవమైత్రియు, శ్రీరామశపథమును దెలిసెను. తోడనేవారు మోక్షసామ్రాజ్యమబ్బినట్లు తలంచి, శ్రీరామ సందర్శనమున కేతెంచిరి. రాముఁడు మునులరాక నాలకించి వారిఁగదియ నెదురేగెను. పరమపావనులగు నా మునివరులకు మ్రొక్కి రామచంద్రుఁడు వారిని బవిత్రాసనములఁ గూర్చుండఁజేసెను. హనుమదాదు లొకయెడ నాసీనులైరి రాముఁ డంతమోమునఁ జిఱునగవు వెలుఁగొత్త యా సంయమీంద్రులంగాంచి " ఓమునిచంద్రులారా! మీకుఁ గుశలమా? మీశిష్యులకు శుభమా? మీతపములు నిరంతరాయములుగ సాగుచున్నవిగదా?" యని యాదరముతో నడిగెను.

ఋషీంద్రులందుఱకు " రామభద్రా! దేవాదిదేవుఁడవగు నీవుండ, మాకు శుభములకేమికొదువ దేవా! నీవు రామరూపమున నవనిపై నవతరించిన రమాకాంతుఁడవుగదా! ఖలశిక్షకు, సాధురక్షకుఁ బ్రతియుగమునఁ బుట్టుచుందువు. దేవా! ఇప్పుడు రావణాసురుఁ డజేయుఁడై మాతపమును గొనసాగనీయుటలేదు. వానినుండి యీదీనులఁగావు " మని రామపరబ్రహ్మమును బ్రార్థించి పూజించిరి.

రఘువరుఁడు వారిప్రార్థనలకు ముదితుఁడై " యోసంయమీంద్రులారా! దిగులొందకుఁడు. రావణాది దుష్టదానవుల బీచమడఁచి మీయిడుములఁ దొలఁగించెద. యథేచ్ఛఁ

బాం" డని పలికెను. ఋషులు రాఘవేంద్రుని యుభయవాక్యములవిని సంతుష్టులై తిరిగి నిజాశ్రమములకుఁ బోయిరి.

రామచంద్రుని యాశ్రిత వత్సలత్వమునకు సుగ్రీవుఁడు సంతోషించుచు " రఘునాయకా! నీవు లోకనాయకుఁడవు. నీదయకు మేరయున్నదా! భక్తచింతామణీ! నీకరుణ యనంతముకదా " యని స్తుతించెను.

రామ:— కపివరా! నీవు సజ్జనుఁడవు. స్నేహపాత్రుఁడ వటులయ్యును, నీకీ కష్టములు తప్పినవికావు. ఇందులకుఁ గారణమేమి? మీయన్నదమ్ముల జన్మవృత్తాంతమెట్టిది? వాలికిని నీకును జెల్మివోయి పగగలిగిన హేతువెయ్యది?

సుగ్రీ:— దేవా! పూర్వము బంగారుకొండపై బ్రహ్మదేవుఁడు తపముసేయుచుండెను. ఒకనాఁ డాతనికన్నులనుండి తారక యోగమహిమచే నశ్రులురలెను. తోడనే వాని నాతఁడు దోసిటఁబట్టెను. అంతనందుండి యొకవానరుఁ డుదయించెను. పితామహుఁడు వింతనంది, వానికి ఋక్షవిరజుఁడని పేరిడి, యడవియందలి కాయగసురులఁదిని బ్రదుకుచుండుమని చెప్పెను. వనాంతరంబుల సంచరించు నాయాదిమవానరుఁడొకనాఁ డుత్తరశృంగము కడకుఁబోయెను. అచటనొకకొలను వికసిత వారిజాతములతో నిండియుండెను. అందలిసలిలము లతినిర్మలములై యమృతముం బోలియుండెను. వానరుఁ డాకాసారమునందు దిగి జలములఁగ్రోలుచుండ నాతనికా

నీటఁ దననీడయగపడెను. వెంటనేవాఁడు సహజజడబుద్ధితో వానిఁబట్టనెంచి యాసరసిలో నుఱికెను గాని యాతండెవ్వరిం గానక గట్టునకెక్కెను. చోద్యమేమందును. ఎక్కుటయే తడవుగా, నాతం డొకచక్కని యువతియయ్యెను. అప్పటికి సాయంకాలమగుచుండెను. కమలజుఁగొల్చి యత్తెరువునఁ జనుచున్న సురనాథుఁడును, శ్రమ నపనయించుకొన నేగుచుండు సూర్యుఁడు నాచెలువనుగాంచిరి. ఆచెలువ చెలువము వారి కాళ్ళకు బందాలయ్యెను. ఇంద్రున కాతరుణి యందలి మరు లధికమయ్యెను. సూర్య తేజము నిర్గమించి యాకోమలి కంఠముపైఁబడెను. అందుదయించినందున నేను సుగ్రీవుఁడనైతిని. ఇంద్రుని తేజ మాతరుణి తలపైఁబడి వాలముకడకుజాఱెను. అందుఁబుట్టినవాఁడు వాలి యయ్యెను. అంత వారు నిజాత్మజుల దీవించిపోయిరి.

ఆ జలజాక్షి దిన శేషమంతయు నచటనే యుండెను. సూర్యోదయమగుసరి కంతయు నామె మరల వనాటమూర్తి యయ్యెను. కుమారులు కూడ వానరులైరి. ఈ విచిత్ర పరివర్తనము ఋక్షవిరజున కర్థమైనదికాదు. ఆతఁ డాకుఱ్ఱలఁ దీసికొని కమలజు కడకేగెను. కథనంతయువిని బ్రహ్మ "కుమారా, వీరిని నీవు కంటివి. వీరితో ధరకేగి కపికోటుల కధినాయకుఁడవై సుఖింబుండు" మని యానతిచ్చెను. ఋక్షవిరజుఁడు

విధియానతి మాళిఁ దాల్చి, "జనకా, ఆసరస్సునమునిఁగిన నతివ రూపము రానేల? వేగినయంతనే పోనేల" యనియడిగెను.

బ్రహ్మ:—కుమారా, ఆసరసియందుఁ దొల్లి పార్వతీదేవి వయస్యలతో జలకేళిసల్పుచుండెను. అప్పుడు కుచ్ఛితులగు రక్కసులు కొందఱు కామినులై జలములఁ జొచ్చుచుండిరి. దాక్షాయణి దానినెఱింగి "ఇందుఁ జొచ్చిన పురుషులింతులౌదురుగాక" యని కిన్కమెయి శపించెను. నేనదివిని యామెను శాపమోక్షము ననుగ్రహింపుమంటిని. ఆదేవి నామనవి నాలించి "ఆయాఁడు రూపమొకనాఁడు మాత్రముండునుగాక" యని యనుగ్రహించెను.

ఋక్షవిరజుండంత మమ్ముఁగొని, కిష్కింధకుఁబోయి యచట రాజై యుండెను. ఇట్లు పెక్కేండ్లు రాజ్యమేలిన మాతండ్రి వృద్ధుఁడై మాయన్నకు వాలికిఁ బట్టముఁగట్టి, నన్ను యువరాజుగా నియమించి తపోవనమునకుఁ బోయెను.

రఘుపుంగవు లావానర సోదరుల జన్మవృత్తాంతమున కబ్బురపడి "ఔను. ప్రాచీనులదివ్యచారిత్రములు వినసొంపులై మహిమాస్పదములై యుండు" ననిరి.

సుగ్రీవు:— ఓరామస్వామీ! మేముకాలక్రమముగ నవయౌవనులమైతిమి. మే మొకనాఁడు దేవతలచేఁ బిలువంబడి పాలసముద్రముఁజిలుకఁ బోయితిమి. ఆదృశ్య మత్యద్భుతమైయుండెను. మందరముకవ్వమయ్యెను. వాసుకి త్రాడయ్యెను. సు

రలు, ఉరగులు, సిద్ధులు సాధ్యులుఁగూడ మమ్ముఁజేరిరి. దానియం దంత గరళముద్భవిల్లి లోకమునెల్లఁ గాల్పసాగెను. తోడనే హరుఁ డద్దానిఁ గబళించెను. మహిమోపేతములగు వస్తువులు పెక్కులం దుదయించెను. వారివారి కోర్కెలఁ బట్టి వారు వా రాయావస్తువులఁదీసికొనిరి. కవిరాజు జ్యేష్ఠాదేవిని గైకొనెను. వివిధ మృగములను వివిధదిక్పతులు వాహనములుగాఁ బరిగ్రహించిరి. మహనీయ సౌభాగ్యములతోనొప్పు లక్ష్మిని నారాయణుఁడు తనకాంతగా వరించెను. కల్పవృక్షము, కామధేనువు, చింతామణి సురలవెంట దివికింబోయెను. తారయను తరుణిని మాయన్నకును, రుమయను రమణిని నాకునిచ్చిరి. మేము నిజపత్నులతోఁ గిష్కింధకేతెంచి స్నేహముననుంటిమి.

ఇట్లుండ నొకనాఁడు దుందుభి యనుదానవుఁడు క్రొవ్వి వాలిని జివ్వకుఁ జీఱ నాతఁ డాదానవుని పీఁచమడఁచి వాని కాయమును గాలనెగఁజిమ్మెను. అదిపోయి మతంగాశ్రమమునఁబడ నామహర్షి కనలి యాకొండనెక్కిన వాలియు నాతని యనుచరులును జచ్చునట్లు శపించెను. రామచంద్రా! ఆశాపబలమున నేనిచట నిశ్చింతతో నున్నాఁడను.

దుందుభికి మాయావియను పుత్రుఁడొకఁడు కలఁడు. వాఁడు తండ్రిచావునాలించి పగతీర్చుకొననెంచి, వాలిపైకి వచ్చెను. మేమిద్దఱమును వానిఁదాఁకితిమి. పిఱికిపందయగు నాదనుజుఁడు మమ్ముఁజూచి పాఱసాగెను. మేము వానివెంట

నంటిమి. ఆదైత్యుఁ డంతలో నొక ధరణీవివరమునఁబడి మాయమయ్యెను. నన్నుబయట నుండ నియమించి మాయన్న లోనికిఁ బోయెను. నేనుగూడఁ బోవనెంచితిఁగాని, భ్రాతృశాసనము నాకడ్డుతగిలెను. ఇట్లొకయేడాదియయ్యెను. అంతఁ గొంతకాలమునకు గుహానుండి నెత్తురు పాఱ మొదలిడెను. లోనుండి యసురాట్టహాసములు వినవచ్చుచుండెను. వాఁడు మాయన్నఁజంపి నాపైకివచ్చుచున్నాఁడని నేనుభీతిల్లి, ద్వారమునకడ్డముగా నొక శైలశిఖరము నుంచి, శోక వారాశినీఁదుచుఁ గిష్కింధకేతెంచి మాయన్నకుఁ దిలోదకములు విడిచితిని. అంత నమాత్యులు రాజులేనిరాజ్య మరాజకముపాలౌనని చెప్పి నాకుఁ బట్టాభిషేక మొనరించిరి. అచటవాలి యానిశాటుఁజంపి పట్టణముఁజేరి నన్నుఁగృతఘ్నుఁడనిదూరి రాజ్యభ్రష్టునిఁజేసి నాదారఁజెఱపెట్టి యీకష్టాటవులఁద్రోసెను. నాఁటిసుత యీ హనుమంతుఁడు, నీలుఁడు, నలుఁడు, తారుఁడు మున్నగు వానర వరులు నాకుఁ బెట్టనికోటలైయుండ, నిట నదృష్ట భాను నెదురుచూచుచు నేఁడు రవివంశమణిని సందర్శింపఁగంటిని. ఓదేవా! నేఁడు నాకు సుదినము. నీయభయవచనము నాసిలుగులఁ దొలఁచివైచినది. నేనుధన్యుఁడనైతిని.

నీలుఁడు వినతాంజలియై “రామచంద్రా! ధర్మమును ధర్మము పరిరక్షించును. అధర్మము నధర్మమే ధ్వంస మొనరించును. అధర్మమున కభ్యుదయము బుద్బుదప్రాయము. పాపా

త్మునిచెలిమి పతితునొనరించును. ధర్మాత్ముని చెలిమి ధన్యుఁ గావించును! రఘువరా! యీవానర నాయకుఁడు పుణ్యముల ప్రోవు. పలికిబొంకనివాఁడు. బ్రతికిచెడినవాఁడు కాన నౌదార్యసంపన్నుఁడు. సిలుగులఁజిక్కియుండుస్వామి కుపకరించిన వాఁడే సేవకుఁడనఁజెల్లును. మేమీవానరస్వామిని మంచి కాలమునందును, చెడ్డకాలమునందును నొక్కరీతిగాఁ గొలుచుచున్నారము. మాసేవయంతయు నొకయెత్తును, యీ కపికుంజరుఁడు పవమానసుతుని సేవ యొకయెత్తుగా నున్నదని మామనవి. యిట్టి దీనమందారుని, యిట్టి సచివశేఖరుని, యిట్టిపరాక్రమవంతుని మఱికానము రామభూవరా!

" క. ఇనసుతుకడ నితఁ డున్నాఁ
డనియెఱిఁగియె వాలికొంతయళుకుచునుండుఁ
దనకేమి యితఁడు గలఁడని
యినసుతుఁడును వెఱవకుండు నింద్రసుతునకున్ "

అని విన్నవించెను రామలక్ష్మణు లెదమెచ్చి మందహాసమొనరించి హనుమంతుని సమ్మానించిరి.

---

## ఏఁడవ ప్రకరణము.

---

### ప్రథమయుద్ధము.

సుగ్రీ:—రామచంద్రా. నీవు సర్వవేత్తవు. నీకుఁదెలి

యని ధర్మములు లేవు. విజయాభిలాషి తన బలమునకన్న నెదిరి బలము మిన్నయని యెన్నుచు విజయోపాయముల నెమకుచుండ జనునుగదా? వాలి మహాబలవంతుఁడు కాన దుర్జయుఁడు, వానిపరాక్రమము నాలకింపుము.

ఉ. నాలుగువారిరాసులొకనాఁటనెత్రిమ్మరివచ్చుఁ గ్రమ్మఱన్
శైలములెత్తి కందుకము చందముగా నెగవైచి నేలకున్
వ్రాలఁగనీకపట్టు సజవంబుగ నేఁగినఁ ద్రెల్లు దిక్కరుల్
వాలియజేయుఁ డాజిగెలువంగ సురాసురులొపరాతనిన్.

రామచంద్రా! పూర్వము గోలభుఁడను గంధర్వరాజొకఁడుండెను. వాఁడతిబలశాలి. వాఁడాజికాంక్షమై వాలిపైకివచ్చెను. వాలి వానితో రేయింబవళ్ళు ఘోరముగాఁబోరి కూలనేసెను. పరాక్రమోపేతులగు యక్షరాక్షసు లెందఱో వాలివలన జీవములఁబాసిరి. రామభద్రా! మున్ను వాలి తూలమువోలె మీఁటిన దుందుభి కళేబరము యోజనదూర మెగిరి వచ్చి యిచ్చటఁబడినదని చెప్పితినిగదా! అల్లదే! దానిఁ జూడుము. ఆయేఁడుతాళ్ళ నవలోకింపుము. వాలివాని నన్నింటి నొక్కటిగాఁగూడఁబట్టి వానియాకులఁ ద్రుంచు మగఁటిమిఁగల దిట్ట. వాసవాదులుసైత మందొక్కదానినైనఁ గదల్పఁజాలరు. రఘుపుంగవా! వాలి విక్రమాదులు తేటపడుటకై యింతగాఁ జెప్పితిని. ఇఁకవాని నేగతిఁజంపెదవో నీకేయెఱుక.

శంకితుఁడగు సుగ్రీవునిపలుకులకు లక్ష్మణుఁడు "వానర

నాయకా యెట్టికర్మంబును రాముఁడొనరించిన వాలినాతఁడు చంపఁగలఁడని నీవునమ్మెద ” వని యడిగెను.

సుగ్రీ:—దేవా! దోర్బలధనుఁడగు వాలికి వెఱచి యీ గిరికూటమెక్కి కంటికింగూర్కు లేక దినమొకయేఁడుగాఁ గడపుచున్నాఁడ, మహాత్మా! రామచంద్రా! నీవు మిత్రవత్సలుఁడవు మహాధనుర్ధరుఁడవు. ఆవాలి పరాక్రమాదులు చాల కాలమునుండి నేనెఱిఁగియున్నాఁడ నీవిక్రమాదులు నా కింతదనుకఁ దెలియవు. నీవాతనికన్న బలహీనుఁడ వనియు, నీకు భయము పుట్టింపవలయుననియు నామతము గాదు. భృత్యుఁడనైన నన్నుఁ గరుణించి యీ మహిషాసుర శవమును మీటినచో నాసంశయము తొలఁగును.

రామచంద్రుఁ డాతనివాక్యములకు సంతసించెను. ఆ పురుషోత్తముని ముఖారవిందమున మొలకనవ్వుతోఁచెను. ‘వానరేశ్వరా! నాపరాక్రమముఁ బరికింతువుగాక ’ యని రాఘవుఁడు లేచి పాదమున నాకళేబరమునుజిమ్మెను. అది పది యోజనములదూర మెగిరిపోయి యొందోకూలెను. సంతో షాశ్చర్యములు పెనఁగొన, సుగ్రీవాది కపు లట్లే నిలిచిపోయిరి. సుగ్రీవుని సంశయముమాత్రము నిశ్శేషమైనదికాదు. ఆతఁడు దాశరథియెదుటఁ జేతులుకట్టుకొని నిలిచి “రామప్రభూ! మున్నిదుందుభికాయము నెత్తురుచేతను మాంసముచేతను నిండి బరువైయుండెను. ఇప్పుడది యెండి, యెముకలుమాత్రమే మిగిలి

యున్నవి. అట్టిదానిని నీవనాయాసముగఁ దన్నఁగలిగితివి. ఈ కార్యముచేతనే వాలియెక్కుడో నీవేయెక్కుడో నిర్ణయింప నాకు బుద్ధిచాలకున్నది రఘూత్తమా! ఆతాళంబులేఁడింటి నొకకోల గాఁడిపోనేసితివేని నీలావు వాలిలావున కెక్కుడని నమ్మెదను. నీబలము నాశ్రయించి భయముదక్కియుండెదను. రామభద్రా! ఈసప్తతాళములఁ గొట్టఁగల శూరుఁడు వాలి పాలిటి యముఁడని, మరుత్తుఁడనుముని మునునాకుఁ జెప్పి యున్నాఁ" డని విన్నవించెను.

సుగ్రీవుని సంశయముఁ బాపనెంచి రఘువీరుఁ డల్లన నగి, విల్లుఁబూని మోపెట్టి యొకబాణమును విడిచెను. ఆశర మాయేఁడుతాళ్ళను రావణాదిశాత్రవుల యాంద్రతాళ్ళసైత మిట్లే తెగునను చందమునఁ దునిమి మరలి రఘురాముదొనఁ జొచ్చెను. ఫెళఫెళారావములు నింగిమ్రోయ నాచెట్లన్నియు నేలఁగూలెను. సుగ్రీవాది కపులు కొయ్యబొమ్మలవలె నట్లే నిలిచియుండిరి. ఆకసమున నింతలో శబ్దమయ్యెను. అచటి వారెల్లరు నింగిఁజూచిరి. అచట నొకవిమానము నిలిచియుండెను. అది సౌందర్యకాంతుల నెగఁజిమ్ముచుఁ గనులకు మిఱుమిట్లుగొలుపుచుండెను. దానియందొక దేవకాంతయుండెను. ఆసుందరాంగి యచటనుండియే రఘురామున కంజలి ఘటించి "పరమేశ్వరా! రమారమణా! రామచంద్రా! నేనుగరుణావతి యను దివ్యాంగనను. సురపతికొలువున నుండుదానను. ఒక

నాఁడు నేను దేవసభకుఁబోవుచుండ దూర్వాసమహాముని నాకెదురయ్యెను. నేనాయతికి నమస్కరింపనెంచితిఁగాని యంతలో నాపైఁట గాలి విసరున కించుకతొలఁగెను. నేను సవరించుకొనునంతలో నాసంయమి దాటిపోయెను. నేనవినయవతినని యామునిక్రుద్ధుఁడై 'యోసీ కరుణావతీ! సౌందర్యగర్వమున నీవు మమ్ము వలపింపఁజూచుచున్నావుగా! మాబోఁటి యతీంద్రులనిన మీబోఁటి బోఁటులకు లెక్కలేకున్నదిగా! ఓసీ! యీయపరాధమునకు ఫలముగా నీవు ఋశ్యమూకాద్రిపై సప్తతాళరూపమునఁ బుట్టుదువుగాక" యని శపించెను. అందులకు నాయుల్లము జల్లుమనెను. అట్లే నేనాఋషీంద్రుని పాదములఁ జాపకట్టుగాఁబడి "యోమహాత్మా! నేనీ తప్పిదమును బుద్ధిపూర్వకముగాఁ జేసినదానఁగాను. కాన నన్నుమన్నించి కృపఁ జూడు" మని వేఁడుకొంటిని. అంత మునీంద్రుఁడు శాంతించి "యోకరుణావతీ! నావాక్యమమోఘము. ప్రస్తుతము భూలోకమునఁ బాపము ప్రబలియున్నది. మరల ధర్మమును స్థాపించి యధర్మమును రూపుమాపుటకై శ్రీమన్నారాయణుఁడు దశరథసూతియై ధరఁబుట్టనున్నాఁడు. ఆపురుషోత్తముఁ డొకానొకకారణమున శాపవశమున సప్తతాళములైయుండు నిన్నుఁ దెగనేసి, నీకు శాపమోక్ష మనుగ్రహించు నిఁకఁబొమ్మని యనుగ్రహించెను. దేవదేవా! దీనవత్సలుఁడవగు నీకతన ధన్యనైతిని. ఇఁకనాకు సెల" వని తిరోధానమొందెను.

రామచంద్రుఁ డంత లేనగవు మోమునఁదోప నర్కజా నీవిపుడు కిష్కింధకుఁబోయి వాలినాలమునకుఁ బిలువుము, మేముగూడ నీవెంటవచ్చెదము. వానినొకకోలఁ గూలనేసి, నీరాజ్యరమను రుమను నీకొప్పగింతును పొమ్మని" నుడివెను. సుగ్రీవుఁడు సీతాకాంతునకుఁ బ్రణమిల్లి లేచి పరుగుపరుగునఁ గిష్కింధకుఁబోయెను. హనుమదాదులుకూడ నాతని వెంబడించిరి. సుగ్రీవుని సింహనాదము లాలకించి, పౌరులు బెగ్గడిల్లిరి. వాలి వానివినుటయే తడవుగాఁ గనుంగొనల నిప్పుకలు నెగయ "నీవీనాఁటి కొకపోటుబంటవైతివటరా! నిన్నుఁగట్టుఁ ద్రాళ్ళను నీవే తెచ్చికొంటివి యుండు" మని బీరములాడుచు సుగ్రీవుఁ దాఁకెను. రవిసుతుఁ డించుకయేని వెనుదీయక "ఓరీ! దురాత్మా! నీపాపము పండినదిరమ్మని" యాతని దూరుచుండెను. ఇప్పు డొండొరులు కలియఁబడిరి. కొండలు కొండలు డీకొనునట్లు వారు పోరుచుండిరి. వారి యార్పులకు నింగి పగులునట్లుండెను. క్రమక్రమముగ వారియొడళ్ళు పూచిన మోదుగులయ్యెను.

రాఘవుఁడు తమ్మునితో నచటికిఁ జెంగటనుండు చెట్టు చాటున నిలిచి కోదండమున సాయకముఁబూన్చి, విడుచుటకై నిండదివిచెను. రాఘవున కేమియుఁ దెలిసినదికాదు. పూన్చిన బాణము నట్లే నిల్పెను. ఏమిచిత్రమిది? వారిలో సుగ్రీవుఁడెవఁడు? వాలియెవఁడు? "ఆహా! నాశరమమోఘమైనది! ఈయన్న

దమ్ములు రూపమునందుఁగాని, వయసునందుగాని, వేషభాషల యందుఁగాని భేదమొకయింతయైనఁ గనఁబడుటలేదు. సుగ్రీవు నేర్పఱచుట కించుకయైన వీలులేకున్నది." యని సంశయ మొంది రాఘవుఁడెత్తిన విల్లు నల్లేదించెను.

సుగ్రీవుఁడు వెనుకంజవేయక వాలితోఁ బోరుచుండెను గాని యాతఁడు పెద్దకాలము నిలువఁజాలకుండెను. మాటి మాటి కాతఁడు రామబాణముకొఱకుఁ జెట్లుచాయలఁ జూచు చుండెను. ఆతని సర్వాంగకములు పటుత్వము చెడుచుండెను. శరీరమంతయు రక్తసిక్తమయ్యెను. ఇఁక నాతఁ డేమాత్రముగాని నిలువనోపక వెనుకకుఁదిరిగి తోఁక ముడుచుకొని రేఁగులు తంగేళ్ళుగఁ ద్రొక్కుచుఁ బరుగెత్తసాగెను. చెక్కుచెదరక ప్రాణములతో ఋశ్యమూకముఁజేరువఱకు కాతఁడు వెనుదిరిగి చూచినవాఁడుకాఁడు. రోషావేశమున వాలి వానిఁదరిమెఁ గాని సుగ్రీవుఁడు చిక్కఁడయ్యెను. ఆతఁడు చేయిజాఱిపోయి నంతనే వాలి ప్రేల్గఱచుచు "బ్రతికిపోయితివి నీయదృష్టము మంచిదిపో" యని వెనుకకుఁ గిష్కింధకుఁబోయెను. హను మదాదులును రామలక్ష్మణులును మెల్లగా ఋశ్యమూకము నకుఁ బోసాగిరి.

## ఎనిమిదవ ప్రకరణము.

---

### సుగ్రీవ పరాజయము.

నాఁటిపోరాటమున సుగ్రీవునియొడలు గుల్లలతిత్తియయ్యెను. ఆతం డప్పుడు ఋశ్యమూకాద్రిపై నొకచెట్టునీడఁ గూర్చుండి యుండెను. ఆకీశోత్తముని మానసాబ్ధియందు భయంకరమగు తుపాను గొట్టుచుండెను. శోకరోషము లాతని యెదఁ బెనఁగు లాడుచుండెను. నయనము లశ్రుజలముచే నిండియుండెను. "అకటకటా! కుడిచికూర్చుండలేక యందని పండ్లకట్టులుసాచినందులకుఁ దగినఫలమందితిని. ఔరౌరా! పచ్చనిదంతయుఁ బైడియని నమ్మిన నావంటి మూర్ఖునకుఁ దగిన శాస్తియైనది. ఆరాముఁ డఱచేత వైకుంఠమునుజూపి నన్నుద్ధరించుసట్లు మాటనిచ్చి కడకు నన్నుమోసము సేయుట నాగ్రహాచార మనుకొనవలయుఁగదా! ఛీఛీ! మానమెన్నఁడోపోయినను పాడుప్రాణములుమాత్ర మింకను దేహమును వదలకున్నవి." యని యాతఁడు వెతనొందుచుండెను.

ఇంతలోనచటికి హనుమదాది ప్రధానులరుదెంచిరి. వారలఁగాంచినతోడనే యాతనికిఁ బుండుపై ముల్లు గ్రుచ్చినట్లయ్యెను. "పావసీ! నీపరువీనాఁడు బయటఁబడినది. నీమాటలకు మోసపోయితిని. నలుసును నగముచేసి, సామాన్య

మానవుఁడగు రామునకు దేవత్వముఁగల్పించి నాకనుమఱగించి
తి" వనిసుగ్రీవుఁడు నిష్ఠురాలాపములాడెను. శోకవ్యాకులుఁ
డగు సూర్యనందనుని కఠినోక్తులకు సామీరి కోపపడలేదు.
"ఓవానరోత్తమా! ఆరామభద్రుఁడు ప్రతినఁ బాలింపకుండుట
కేదియో గొప్పకారణ ముండియుండును. ఆలములోన నోడ
మికి, మేలిమికైన బొంకమికి మెచ్చినచో వృథగామికి రామ
నరపాలున కతఁడేసాటి. ఆరాముఁడు న్యాయపరుఁడు ధర్మవత్స
లుఁడు. మిత్రరంజకుఁడు. ఆమహామహునిదివ్య లీలల నీవు
వినియుండలేదా! ఆతఁడు కౌశికుయజ్ఞముఁగాచిన జయశాలి.
అహల్యఁబ్రోచినఘనుఁడు. కాకాసురుని తప్పుఁగాఁచిన సద
యుఁడు. శబరిని సంరక్షించిన చల్లనిరాజు. నిన్ననుగ్రహించిన
మేటి; దయాభూషణుఁడు. ప్రపంచమంతయు బంటుపోలమ్ము
గ నెదురులేని ధీరుఁ డారాముఁడు. ఓవనాటవరా! రాముఁడు
సుగుణాభి రాముఁడు. ప్రజలకట్టి ప్రభువు, సేవకులకట్టిస్వామి,
శరణార్థులకట్టి శరణ్యుఁడు,యాచకులకట్టిదాత,పదునాల్గు భువ
నముల మఱి లేఁ" డని యాంజనేయుఁ డాతనినూఱడించెను.

పవమానసుతుని వాక్యములు సుగ్రీవునిచెవుల సుధ
చిందినట్లుండెను. ఆతనికి సంతయూఱటకలిగెను. "ఓపావనీ!
నీమాటలుచల్లగనున్నవి. నీపలుకులు నాయుల్లమును బల్లవిం
పఁజేయుచున్నవి. ఆ రామలక్ష్మణులు వాలి గూఢ
చారులేమో యని నామది సంశయించుచునేయున్నది. లేకు

న్న నను వాలి చావఁగొట్టుచున్నను వారూరకుండుటకుఁ గార ణమేమికలదు? హనుమంతా! నేఁడు నాయదృష్టము బాగుం డినది. లేకున్న నీపాటి కంతకాలయమునఁ బాతకాపై యుం డెడివాఁడ ” నని సుగ్రీవుఁడు దీనముగాఁ బలికెను.

హను:—ఓవనచరోత్తమా! కుశాగ్రబుద్ధివి నీసంశయ ము నాకువింతఁగొలుపుచున్నది. నాయుపదేశమంతయు నీ యెడ వెల్లిఁ గలిపిన చింతపండగుచున్నదేల? దాశరథి దయా వారిధియనియు నాడి తప్పనివాఁడనియు ముందే చెప్పితిని. విష్ణువు రాముఁడై పుట్టెనని తెలియవా? దుష్టుల శిక్షించి, శిష్టులరక్షించి ధర్మము నుద్ధరింప నవతరించిన పరమాత్మఁ డా రామచంద్రమూర్తియని నీవుగ్రహింపలేదా?

సుగ్రీ:—సరియే. వాలికూడ ధర్మాత్ముఁడని పొరపడి యారఘుస్వామి వాలిపంపున నాపైకివచ్చినాఁడేమో?

హను:—ఆహా! సర్వజ్ఞునకు సైతము ప్రమాదములా! ఏమి నీయజ్ఞానము! వాలితోఁ జెలిమి వాటించినచో రామా వతారమువలని ప్రయోజనమేమికలదు? రావణాదిదుష్టదాన వుల సంహరింప నారాయణుఁడు రాముఁడై పుట్టెను. సీతాప హారణము నిమిత్తమాత్రము. వాలిపరాక్రమాతిశయములు రామునికిదివఱకే తెలియును. శ్రీరాముఁడు వాలితోస్నేహ మొనరించినయెడల వాలియానతిపై రావణుఁడా సీతామహా దేవిని రామునకర్పించి తెలియక చేసినతప్పుని చెంపలువేసి

కొనఁడా! ఇఁక రావణాదిరాక్షసులును వాలివంటి దుర్మార్గులట్లే చిరంజీవులై యుందురు. జగమంతయు నట్లేవగచుచుండును. ఇంతమాత్రమున కిందిరావల్లభుఁడు రాముఁడై యేల పుట్టవలెను? సుగ్రీవా! భగవత్సంకల్పములు సంతతశుభ సంధాయకములని యెంచువాని కెగ్గులేదు.

రఘుపుంగవు లంతలో నచటి కరుదెంచిరి. హనుమానుఁడు వారికిఁ బ్రణమిల్లి వారిని సుఖాసీనులఁ జేసెను. దీనుఁడగు సుగ్రీవుఁడు వంచినతలనెత్తకుండెను. పరాజితుఁడగు నాతనికి రామునిఁ జూడ మొగము చెల్లకుండెను. ‘కీశోత్తమా! నీవు సేమముగఁ దిరిగివచ్చుటయే, మాకుఁ బదివే’ లని రాముఁడాతని హెచ్చరించుకొనెను. ఆ ప్రస్తావనచే సుగ్రీవునకు వేయితేళ్ళు కుట్టినట్లయ్యెను. ఆపాదమస్తకము చుఱచుఱలాడసాగెను. హనుమ యుపదేశము లేమెడకో యెగిరిపోయెను. లజ్జాభరమున రవిసుతుఁడు క్రిందఁజూచుచు “రఘుపతీ! నేను నిర్భాగ్యుఁడను. వాలినన్నుఁ జావఁగొట్టక కరుణించి విడిచినందునఁ దిరిగిరాఁగలిగితిని. నీవుపోయి వాలితోఁ బోరుము నేనువాని నొకకోలఁ గూలనేసెద’ నని యభయమొసంగి, తుదకిట్లు మాటమీఱుట నీవంటి సత్యసంధులకుఁ బాడియా? ‘వాలివధ నాచేతఁ గాదని ముందే చెప్పియుండిన నింతకష్టము కాదుగదా! వాలిచే నేఁ జచ్చినపిదప, నీవు వానిఁ - జంపియుఁ బ్రయోజనమేమి? నీసత్యమును నీతేజ

మునునమ్మి వాలితోఁ బోరనుంకించితిఁగాని, లేకున్న నాతఁ డేడ? నేనేడ?" నని యెల్గుత్తాపడఁ బల్కెను. దుఃఖము మతిని జెఱచునని రామునకుఁ దెలియును. "ఓగిరిచరవరేణ్యా ఇటుసూర్యుడటు పొడిచినఁ బొడుచునేమోకాని, నామాటకు మాత్రము తిరుగుండ దనియభయహస్తమిచ్చియు నరికొప్పగించునంత ద్రోహినా నేను!

"క॥ కరచరణనఖముఖాక్షి
స్వరశిరములు నుఱమునరయ వాలికినీకుఁ
సరిగాన నమోఘము నా
శరమేయంజాలనైతి సైఁపు, కపీంద్రా!"

శరణార్థియగు నిన్నజ్ఞానవశంబునఁ జంపితినేని, జగంబుల జనంబులు నామాహాత్మ్యమునుజూచి నవ్వరా! ఓప్లవగేశ్వరా, కడచనిన కార్యమునకు వగవకుము. నీవు మరల ధైర్యముతో వాలిపైకిఁబొమ్ము. నేనపుడు వానిఁ గూల్చెద. నీవు సుగ్రీవుఁడవని నాకుఁ దెలియుటకై యేదియేని యడియాలము దాల్పుము. నీకిది సమ్మతమా?" యని రాముఁ డాతని నడిగెను.

సుగ్రీవుఁ డందులకు "రఘుపుంగవా నీకుఁదెలియనిదేమికలదు! నీసంకల్పములు మీఱ నేనెంతవాఁడను. వాలి మరలనాతోఁ బోరాడరాఁడేమోయని నాసందియము చచ్చినపాముఁ జంపుట శౌర్యలక్షణముకాదని యాతఁ డుదాసీనుఁడైయుండుఁ గాఁబోలు" నని విన్నవించెను.

రాఘవుఁ డాతని పలుకుల కలరుచు "కపీంద్రా! శూరులు శత్రుగర్జనల సైఁపరు. వాలియధికశూరుఁడు. నీ వీరాలాపములు వానిని బైటికిలాగును. ఇఁక దీపమును జేరిన దోమకు జీవమెక్కడిది! వాలిఁ బొలియించి, నీచే వానర రాజ్యమేలింతు" నని ధైర్యముచెప్పి "సౌమిత్రీ! ఈకొండ నెత్తమున గజపుష్పియను తీఁగె బాగుగాఁ బుష్పించియున్నది. దానిఁదెచ్చి యీకపీంద్రుని కంఠమునఁగట్టు"మనెను. రామానుజుఁడట్లే లతఁగొనివచ్చి సుగ్రీవు నరుతఁగట్టెను. పుష్పమాలఁ దాల్చిన ప్లవగేంద్రుఁడు నక్షత్రమాలా వృతుఁడగు చంద్రుని వలెఁ బ్రకాశింపసాగెను. "దేవా! ధన్యుఁడ" నని రామ లక్ష్మణులకుఁ బ్రణమిల్లెను. 'విజయోస్తు'ని వారు దీవించిరి.

---

## తారప్రబోధము.

మధ్యాహ్నము నాలుగుఘంటలైనది; కిష్కింధాపుర వీథులయందుఁ బ్రజలు గుంపులుకూడియుండిరి. అవిగో నక్షత్రములు! అవిగో నక్షత్రము లని యొకరి కొకరు గగనమునఁ జూపించుచుండిరి. ఆకసమునఁ బగలు నక్షత్రము లగపడుట

యందఱకుఁ జోద్యమైయుండెను; ఈ ప్రకృతి విచిత్రమునకు వారు తలకొక తీరున మాటలాడుచుండిరి.

ఒకఁడు:—ఆకాశమున సూర్యుఁడున్నాఁడు. అప్పటికిని నక్షత్రములున్నవి. ఇదేమివింత?

ఇంకొకఁడు:—అవును నాకు నిన్నటికిఁ దొంబది యేండ్లునిండినవి, పుట్టినప్పటినుండియు నేనిట్టి విచిత్రమును గని విని యుండలేదు.

వేఱొకఁడు:—నిన్న రాత్రి పన్నెండు ఘంటలప్పుడు నేను భగవన్నామ స్మరణ మొనరించుచుంటిని, అప్పు డాకాశ మున నింద్ర ధనుస్సగపడినది. అదేమిచిత్రము?

ఇంకొకఁడు:—అదియునిట్టిదే. నేనును జూచితినిగాని చెప్పుటకు మఱచితి.

మఱియొకఁడు.—ఈప్రకృతి చిత్రములు దుర్నిమిత్తము లని నాయభిప్రాయము. పూర్వము పరశురాముఁడు క్షత్రి యుల నిరువదియొక్కమారు చించిచెండాడెనని మీరు విని యుందురు; ఆబ్రహ్మచారి తమరాజ్యమునకు వచ్చుటకు ముం దిట్టి దుశ్శకునము లాక్షత్రియుల కగుచుండెనఁట! ఈవిషయము మన రాజపురోహితుఁడు నీలకంఠచ్యవనులు చెప్పినారు.

వేఱొకఁడు:—మనరాజుగారి కీసంగతిఁ జెప్పినమేలు.

మఱియొకఁడు:— మంచివాఁడవు! నిన్నుఁగట్టుటకు త్రాళ్లను నీవే తెచ్చికొందువా?

ఇంతలోఁ 'దొలఁగు తొలఁగు' మని యిరువురు రాజభటులు వచ్చిరి. వారిఁజూచి యాప్రజాసమూహము రెండు పాయలయ్యెను. 'వాఁడుగో! రాజ పురోహితుఁడు నీలకంఠ చ్యవనులు రాజాజ్ఞయైనది కాఁబోలు సభకుఁబోవుచున్నాఁ'డని జను లనుకొనుచుండిరి. నీలకంఠ చ్యవనులు కొలువు కూటమునకుఁ బోయెను. వానరాధిపుఁడు వాలి సింహాసనస్థుఁడై యాతనికొఱకెదురు చూచుచుండెను. చ్యవనులఁ జూచి వాలి యాతనికిఁ బ్రణమిల్లి "విప్రోత్తమా! ఈవిచిత్రములకర్థమేమి? రెండుమూఁడునాళ్లుగా బీదకలలువచ్చుచున్నవి.

నీల:—దేవా! ఈదుర్నిమిత్తములు రాజ్యాధీశుఁ డాఁకునని శాస్త్రములఁ జెప్పఁబడియున్నది. పగలునక్షత్రములగపడుటయు, రాత్రిల నింద్రధనస్సుపుట్టుటయు, రాజునకమంగళకరములని గర్గమహర్షి చెప్పియున్నాఁడు. దానికిఁ దోడు దుస్స్వప్నములు వచ్చుచున్నవని మీరనుచున్నారు.

వాలి:—అవును. వీటికిఁ బరిహారములులేవా?

నీల:—ఉన్నవి దేవా! పెద్దవాఁడును, చూపుమందగించినది, రాత్రిలఁ జదువఁజాలను, ప్రొద్దున శాస్త్రములఁజూచి విధానమును విన్నవింతును.

వాలి:—మంచిది! ఈనాఁటి కిఁకఁ గొలువు చాలింతము.

అప్పటికి సాయంకాలమయ్యెను. రక్తాంగుఁడగు భానుఁడు గుభాలునఁ బశ్చిమాంబుధిఁగూలెను; భాతృమరణము

వను వాపోవుచున్నవో యనఁ బతంగములు కొలకొలఁ గూయుచుండెను. వాలి నేరుగాఁ దారయగు తారకడకుఁ బోయెను. పాపము పతిప్రాణయగుతార యాదుశ్శకునముల నంతకుముందే వినియుండెను. ఆమె వాలికెఱఁగి "ప్రాణేశ్వరా! మిమ్ములఁ జూచినపిదప నామనో వ్యాకుల మణఁగిన" దని కంటఁదడిపెట్టుకొనెను. వాలి యాకాంతను దగ్గఱకుఁజేర్చి చెక్కిలినొక్కుచు "బేలా! ఈభయమేల? మీరు స్త్రీలు సహజ భీరువులు, అడుగడుగునకు దిగులొందుచుందురు. ఈ యపశకునములకుఁ దగిన పరిహారముల రేపానరించితిములెమ్ము. నీవు నాయర్ధాంగివికదా! నీవు సుకృతాత్మవు, నీవొనరించు దేవ పూజలు, ధర్మములు నాకురక్షలై యుండును. గాన బెగడొందకుము. కాంతామణీ యావజ్జీవము నీవు సుమంగలివై యుందువని యొక జోస్యుఁడు మున్నొకసారి చెప్పియుండలేదా! దాని ప్రికారము నీమంగళసూత్రము......

"తెగినది తెగినది దేవా! తెగిన" దని యొక భటుఁడఱచుచు వచ్చి వాలి నభ్యంతరపెట్టెను

వాలిరోషమున కంతములేకపోయెను. కాలాంతకుని వలె నాతఁడు కనలసాగెను. 'పలుగాకీ యేమిరానిప్రేలుడు? ఆయమంగళమేమిరా?' యనిగద్దించెను.

తార యావాక్యమును గూర్చిపలుకుకొని 'హా ' యని

మూర్ఛిల్లెను. వాలియామె కుపచరించుచు ' నేమి తెగినదిరా మూర్ఖా! ' యని యాభటుని మరల గద్దించెను.

భటుఁడు గడగడలాడుచు " దేవా! ఏమని విన్నవింతును! ఎన్నఁడెఱుగనివింత... ... ... ...

' ఉపోద్ఘాతము విడువుమురా మూర్ఖుఁడా! '

" మన కొలువుకూటమునందలి విజయధ్వజము పెనుగాలికిఁదెగి నేలఁగూలిన " దని యాభటుఁడు విన్నవించెను. తార కొంత తెప్పరిల్లి " నాథా! యమంగళము శాంతించుఁగాక" యని కన్నీరు బొటబొటఁ గ్రిందఁబడుచుండఁ జెప్పలేక చెప్పెను; భటుఁడు వెడలిపోయెను. వాలి మానసాంబుధి కల్లోలమై యుండెను. " ఏమి యీయమంగళ పరంపరలు! నాయికా యేల దురపిల్లెదవు? మాటలకే మీరింతగా దిగులు చెందిన నింక మేము చేఁతలకెంతగా భయపడవలయును? ఒకవేళ వచ్చిన యాపదలు ప్రాణులకుఁగాక పాదపములకావచ్చునే. సానఁబట్టిన మాణిక్యము వన్నెకెక్కునట్లు, కష్టాటవులఁబడిన ప్రాణికోటులు కృతార్థులగుచుందురు. ఇది రహస్యము. ఇఁక దిగులేల?" యని వాలియామె ననునయించెను.

తార లేచికూర్చుండి "నాథా! నామానస మెందులకో కీడును శంకించుచున్నది. రానున్న మేలుకీడులకు ధృతియు భీతియుఁ గలుగుచుండుఁగదా!... ... ...

"ఎవరికి? మీవంటి యబలల" కని వాలి యామాట నందుకొనెను.

భీతాత్మయగుతార గాలికిఁదూలుతీఁగెవోలె వణఁకు చుండెను. ఆనాతి నోటమాటరాకుండెను. "నాథా! యటువిను మటువినుము కాలమేఘము గర్జించుచున్న" దని యామె యున్నట్లుండి యనెను. వాలి యాశబ్దమునువినెను. 'ఎక్కడి దీసింహనాదము? ఎక్కడిదీ వీరాలాపములు?......వాలి నేత్రములఁ గెంజాయరంజిల్లుచుండెను. ఆతని కోపమున కంతము లేకపోయెను. 'ఓహో! మరల మగవానివలె వచ్చితి వటరా?' యని వాలి తీవ్రవ బయలుదేఱెను. తార కంతయు నర్థమయ్యెను. మరల సుగ్రీవుఁడరుదెంచి, వాలి నాజికిఁ జీరుచున్నాఁడని యామె గ్రహించెను. తోడనే యామె యాతని కడ్డుతగిలి యాతనిఁ గౌగలించుకొని "ప్రాణవల్లభా! నా హితాలాపము లాలకింపుము. ఔఁగాముఁ లాలోచింపక నీవిపుడు రవి సుతునిపైకిఁ బోకుము. ఇంతలో మించినదేమికలదు? ఈ రేయి పగతుని తెలిఁగొల్ల నెటిఁగి యుదయమున నెదిరింపవచ్చును. నాథా! యొకటి యోచింపుము. ప్రాణార్తుఁడై పాఱిపోయిన సుగ్రీవుఁడు మరల నెట్లురాఁగలిగెను? దీనికిఁ గారణమేమి? ఎవఁడో యసహాయశూరుఁడొకఁడు సుగ్రీవునకుఁ దోడైయుండి నందప్పు యాతఁడిట్టి దిట్టతనాన యుద్ధమునకు వచ్చియుండ" ననెను.

వాలి:—(నవ్వుచు) ఓసివెఱ్ఱిదానా! ఏమి నీబేలతనము! మూషికములు వేయియైన నొకమార్జాలము నేమిసేయఁగలవు? పిఱికిపందలగు సుగ్రీవునివంటివారు వేయిమందియైన నాయట్టి వీరశేఖరు నేమిసేయఁగలరు?

తార:—మనయంగదుఁ డొకవార్తను వేగులవారివలన విని నాకెఱింగించి యున్నాఁడు. రవిసుతునకు హితమొనర్పఁ బూని ఋశ్యమూకమున కిద్దఱువీరు లరుదెంచియున్నారు, వారు రామలక్ష్మణులు, అయోధ్యాధిపసుతులు; వారు దుర్జయులు. రామచంద్రుఁడు నిన్ను... అయ్యో! నోరాడకున్నది.–తర్వాత సుగ్రీవునకుఁ బట్టముకట్ట మాటనిచ్చియున్నాఁడఁట. ప్రాణేశ్వరా! యిఁక నినసుతుఁడు నీకుఁ దలఁకఁడు.

వాలి:—(చిఱునవ్వుతో) అయిన జీవితేశ్వరీ! నీవిపుడు విన్నవింపఁదలచిన విషయమేమి?

తార:—నాథా! అజేయుఁడగు రఘురామునితోఁ బగఁ గొనుట, నిద్రించు మృత్యువును దట్టిలేపుట వంటిదని నా మనవి. దేవా! బలవద్విరోధ మాత్మనాశంకరముగదా! నీ యనుజునితోడి వైరమువీడుము. యౌవరాజ్యమున కాతనిఁ బట్టముకట్టుము. రాముప్రాపుననుండు రవిసుతు నోడింప నింద్రాదులైనఁజాలరు. నాథా! ఆరామచంద్రుఁడు శరణార్థి రక్షకుఁడు. పోయి యామహాత్ముని చెలిమివడయుము.

వాలి:—తరుణీ నాహితైషిణివై నీవుచెప్పినమాటలు

నాకుఁ బ్రియమునించినవి కాని నీపలుకులు శూరమ్మన్యునకు హితములుకాని, నాయట్టి సహజశూరున కవినచ్చవు. అరవి సుతుఁడు దిక్కుమాలి యొరుల శరణనియెఁగాక నాకేమి పట్టినది? వాఁడొక పోటుబంటువోలె మరల నరుదెంచి నన్నుఁ బోరునకుఁ బురికొల్పుచుండ నటువోక వానిబీరముల సహించియుండుటకు నేనేమి పిఱికిపందనా? రామామణీ! యొకవిషయమును గమనింపవైతివి.

"క. రామున కేనపరాధం
బేమియుఁ గావింప నాకునింతయు నలుగం
డామహితాత్ముఁడు సుగుణో
ద్దాముఁడు సద్ధర్మవిదుఁడు తలఁకకుమబలా."

శాత్రవుఁడు పైకొనివచ్చుచుండ, బిరుదఱి తొలఁగుట కంటె మరణము మేలుగదా! ఓమానవతీ! పోయివచ్చెద.

వాలి.—యాతనన్వంగిని కౌఁగలించుకొని 'ప్రేయసీ! సెలవా?' యని యడిగెను. తార నాథునకుఁ బ్రదక్షిణించి 'దేవా! నీకు విజయమగుఁగాక' యని గద్గదికతోఁ బలికెను.

——:(o):——

## పదియవ ప్రకరణము.

---

### వాలివధ. 1

వాలి యట్లతిరయమునఁ బురము నిర్గమించి సుగ్రీవుని వెదకఁ సాగెను. కాలఁడచిన పన్నగమువోలె నాతఁ డూర్పులుపుచ్చుచుండెను. 'ఎక్కడనున్నాఁడవురా?' యని యాతఁడు గర్జించుచుండెను. సుగ్రీవుఁ జూచినవెంటనే వాలి 'మరలఁ బోరికివచ్చితివఁటరా?' యని యఱచి నడుమునఁ జేలముబిగించి 'రమ్ము నీయాయు వీదెబ్బతోసరి రమ్మని' యాతని డాసెను రవితనయుఁడు వెనుదీయక "దురాత్మా! నీకుఁ గాలము తీరినది ర"మ్మనిముందుజవేసెను. వారిద్దఱిప్పుడు బాహా బాహిఁ బెనఁగసాగిరి. ఒకరినొకరు పిడికిళ్ళఁ గ్రుద్దుచుండిరి. ఱాలరువ్వుచుండిరి చెట్లఁగొట్టుచుండిరి వారిదేహములు నెత్తుటఁ దొప్పదోఁగుచుండెను. క్రమక్రమముగ శక్రసుతునకు బలము హెచ్చుచుండ రవిసుతునకు క్షీణించుచుండెను. సుగ్రీవుబలదర్పములు సన్నగిలుచున్నవని చెట్టుచాటునఁ గార్ముకపాణియైయుండు రాఘవుఁడు గ్రహించెను. 'ఇఁక వాలిఁ గూల్పకున్న సుగ్రీవుఁడు కూలు'నని రాముఁడనుకొని యమోఘాస్త్రము నొకదానిని వింట సంధించి వాలిపైఁ బరఁగించెను, ఆశరము వాసవివక్షమునఁ బిడుగుకైవడి నాటెను. తోడనేవాలి 'హా' యని బిడుగడచిన కొండవోలెఁ గ్రిందఁగూలెను. సుగ్రీవుఁ డ

ల్లె నిలిచిపోయెను. విజయశీలియగు నాతని ముఖాంబుజ మా
నందభాసురమైయుండెను. పుణ్యాంతమున సురపురమునుండి
భువికివ్రాలిన యయాతివోలెఁ గ్రిందఁబడియుండు వాలియొద్ద
కు రామలక్ష్మణులరుదెంచిరి. రామసందర్శనమున వాలిని దుః
ఖరోషావమానములు పైకొనెను.

“ఓరాఘువేంద్రా! నీవు ధర్మవేదివని ప్రసిద్ధికెక్కియు
న్నావు. ఇట్టివాఁడవని తెలియుటంజేసియే నేను నిశ్శంకతో
సుగ్రీవుఁ దాఁకితిని రామా!

క. వీరునితోమార్కొని ప్రతి
వీరుఁడనై పోరుచుండ వెనుకనొదిఁగి ని
ష్కారణముగ వంచించి వి
దారింపఁగ నీకురాజ ధర్మంబగునే?

‘ఆరాముఁడు సత్యవ్రతుఁడు. సుగ్రీవున కామహాత్ము
నితోడున్నది. నిన్నాతఁడు వంచనముననైనఁ జంపు’ నని నాదే
వియెఱుఁగఁ జెప్పిన, ‘నామహాత్ముఁడు ధర్మపరుఁడు. నన్నేల
వధించు?’ నని తలఁచివచ్చితిని. యోరామనృపాలా! రాజధ
ర్మవిదుఁడవు నీవు బోయక్రియవర్తింతువని నేఁదలఁపలేదు.
ఉత్తమ వంశ్యుఁడవు నీవు పాలకప్పునునుండు పాషాణమవైతి
వేల? ఔనౌను పాలఁ బెరిగినను వేము విషముమానునా?
కులముప్రధానమా గుణములేకుండిన.

“ఓరఘురామా! మేము వనచరులము. మీరు మాన

వులరు మేము కందమూలములు, కాయగసరులుతిని బ్రిదుకు వారము. మీరురాజాన్నముఁదినువారు కాన మనకు వైరము నకుఁ గారణమెక్కడిది? లోకమునఁ గామినీకాంచనములు వైరకారణములు. దీన నెద్దానినాశించి నన్నుఁ బొలియించితివి."

"దాశరథీ! కోతినగు నన్నేలచంపితివి? నామాంసము నీకుఁ దినరానిదికదా! నాచర్మము నీయట్టిధార్మికులు మెంయఁ దాల్పరానిదిగదా! అట్టినన్నువధింప నీకేమి విషముపోసితిని? ఓరఘుపతీ! కాలమాసన్నమగుటంజేసి నాదారపలుకుల లెక్కసేయకవచ్చి యిట నీకోలఁగూలితిని. వంచనచే నన్నుఁగూల్చితివిగాక! ఎదుటనిల్చి యనిసల్ప నీచేనగునా? ఓరాఘవా! నీ రాజనీతి యేయేటఁ గలిసినది? నీచతురత యెంతు వలసపోయి నది? ఆపదితలల పురుఁగును రావణునిమడియింప నీపెడత్రోవఁ బట్టితివేల? రవిసుతునితో నెయ్యమొనరించి యీ వెనుక నన్నుఁజంపి తర్వాత రావణుఁజంపుటయీ యిదెట్టి రాజనీతి? నాతో నొక్కమాటఁ జెప్పియుండిన నారావణుఁ జెవులుపట్టి కొనితెచ్చి నీకాళ్ళవైవనా? నీదేవినిప్పించి యుండనా రామా! ఇట్లు దూడగడ్డిని గోయుటకు డెంకాయచెట్టు నెక్కితివేల?"

"సుగ్రీవుఁడు వానికై వాఁడు నాప్రాణముల హరించుటలో నొకించుక ధర్మమున్నది. వాఁడు నాదాయాది, దాయాది చావఁగోరుట ప్రసిద్ధము కాని నీకిందేమి సంబంధమున్నది."

వాలి యంత మాటలాడఁజాలకపోయెను. బాణవేదన

నాతఁడోరువఁజాలక యుండెను. బలహీనతచే నాతని కన్నుల మబ్బులుగ్రమ్ముచుండెను. వాలియురుతనుండు హేమమాల వాలిశరీరము రామబాణ మివి యొండొంటినిమించి శోభిల్లు చుండెను. తెప్పవ్రాల్పక రాముప్రత్యుత్తరము నాతఁడట్లే నిరీక్షించుచుండెను. పరుషములైనను, శూరోచితములగు వానర నాయకుని మాటలను రామచంద్రుఁ డింతసేపుగా శ్రద్ధతో నాలకించుచుండెను.

" ఓవనాటవరా! ధర్మాధర్మముల రూపమెట్టిదో యెఱుంగని నీవు నన్నిట్లు నిందించుటయందు వింతయేమియును లేదు. నీవు వానరుఁడవు. నీకుఁ జపలతసహజము. ఇఁకఁ బెద్దలరీతి నీకెట్లు తెలియఁ గలదు? సాంతముగ నామాటలవిని శాంతిఁబొందుము. "

" జలధిగిరి సహితమగు నీయిల యిక్ష్వాకులది. పశు పక్షి మానవులను సముయమరసి కావను, దండింపను వారికధికారమున్నది. ఈధరిత్రి నిపుడు మాభరతుఁడేలుచున్నాఁడు. ఆతని యాదేశాను సారము మేమిపుడు ధర్మరక్షణార్థము ధర యెల్లఁదిరుగుచున్నారము. దుష్టశిక్షణమే ధర్మరక్షణము. ఇఁక నీవో పాపాత్ముఁడవు. అధర్మపరుఁడవు కామాంధుఁడవు. ఓయీ! తమ్ముని, శిష్యుని, తనకుఁ బుట్టిన పుత్రులని భావింపవలయును! సుగ్రీవుఁడు నీతమ్ముఁడుగదా! అట్టిసజ్జనుని రాజ్యభ్రష్టుఁజేసితివి. కామమున నాతనిపత్నిఁ జెఱఁబట్టితివి. ఇట్టి

నీవు దండనార్హుఁడవుకావా? తోఁడఁబుట్టువును గూఁతును త
మ్మునిభార్యను గామించువాఁడు వధ్యుఁడని మానులనిరి. నీనే
రముల కీదండనము శాస్త్రసమ్మతము. రాజుదుర్జనుల దండింప
వలయుఁగాన నిన్నువధించితిని. ”

“ ఓయీ! మఱియొకమాట! వహ్నిసాక్షికముగ సుగ్రీ
వునితో సఖ్యమొనరించి నిన్నుఁబరిమార్చి యాతనికిఁ బట్టము
కట్టునట్లు మాటనిచ్చితిని ప్రతిజ్ఞఁ బాలించుట ధర్మవిరోధ
మెట్లగును? నామిత్రునకు నీవు శత్రుఁడవు కాన నాకును నీవు
శత్రుఁడవు. నిన్నుఁ బరిమార్పకున్న నాకు మిత్రద్రోహము
వాటిల్లును కాన నిష్కారణముగ నిన్నుఁ జంపియుండలేదు.
ఓయీ! నీ వపరాధివి నేను రాజప్రతినిధిని నాచేమడిసిన నీకుఁ
బుణ్యలోకమబ్బును. జను లఘములొనరించియు రాజశిక్షితు
లై సురలోకమున కేగుదురని యెఱుంగవా? ఇఁక నపరాధుల
ను విడిచిపుచ్చురాజును నిరపరాధులఁ బట్టు రాజును నరక
కూపమునఁ దప్పక కూలుదురు. ”

“ ఓహరివరా! రాజులకు వేటవిహితము. నీవు వనచ
రుఁడవు. అందును దుష్టుఁడవు. దుష్టమృగములు నిద్రించుచు
న్నను, ఏమఱియున్నను తెలివితోనున్నను లేకున్నను, పొంచి
యో ముంగలనిల్చియో యెట్టులో యొకరీతి వాటిఁగడతేర్చు
ట రాజధర్మము. ఓకపీశా! వేల్పులు ధాత్రియందు రాజవేష
ములఁ జరించుచుందురు. నీతప్పును నీవెఱుంగక నీపొందినదం

డనమునకు వారినిదూరి పాపము మూటఁగట్టుకొనకుము. ఇంతయుఁ దెలిసితివా? ” యని రామచంద్రుఁ డాతనికిఁ దెలియం జెప్పెను.

సుధాసమానములును చాతుర్య కలితములును ధర్మసహితములునగు రామచంద్రుని సమాధానముల నాలకించి వాలి సంతసించెను. దూషణభావమంతరించి భూషణభావమాతని మదినంకురించెను. ఆవానరోత్తముఁడు నమ్రుఁడై “ రామప్రభూ! మూఢాత్ముఁడనై నిన్ననరాని మాటలంటిని శరవేదన నోరువఁజాలక నిన్ను దూరితిని రామచంద్రా! నన్నుఁగరుణింపుము. నారాయణుఁడవగు నీబాణమునాకు సద్గతిఁ బ్రసాదించినది ” యని బలహీనతచేఁ గన్నులు మూసికొనెను.

## పదునొకండవ ప్రకరణము.

---

### వాలివధ

వాలివధ యంతలో నంతట వ్యాపించెను. తార కావార్త తెలిసినంతనే మొదలుతఱిగిన మహీజమువలె నట్టే నేలఁ గూలి మూర్ఛిల్లెను. పాపము బాలుఁ డంగదుఁడు దిక్కుమాలి

పెద్దపెట్టున నేడువసాగెను. రాజభటులు దారిఁ జూపఁ దార పిచ్చిదానివోలె రణరంగమున కరుదెంచెను. 'ఏఁడీ! నాప్రాణేశ్వరుఁ డేఁడీ? నా పెన్నిధానమని వాపోవుచు నామె గుండెలు మోదుకొనుచుండెను. కురులు తెంపుకొనుచుండెను. ఆమెదుఃఖము దుస్సహమైయుండెను. కన్నీరు కాల్వలు గట్టి పాఱుచుండెను. నెత్తుటఁ దొప్పఁదోఁగుచుఁ గ్రిందఁబడియుండు వాలి యాకాంతకంటఁబడెను. తోడనే యామెచాప కట్టుగా నాతనిపైనివాలి, " హా వల్లభా! హా వానరేశ్వరా! ఆయ్యో మనోహరా! వీఁడుగో నీయంగదుఁడు నీకన్నకుమారుఁడు నీగారాబుపట్టి యకటా! నాథా! యనుజు నన్యాయముగాఁ బురమువెడలఁ జేసినందుల కిదిశిక్షకాఁబోలు! తమ్మునిభార్యను దెగువమెయిఁ జెఱచినందుల కిది దండన కాఁబోలు! " నని విలపించుచుండెను.

ఒకయెడఁ జింతాముద్రితుఁడై నిలిచియుండు సుగ్రీవుని గాంచినతోడనే యామెయొడలుమండెను. " ఓయినతనయా! మీయన్నఁజంపితివనదికదా! ఇఁకనిదిగో నాగొంతుఁ గూడ గోసి, యీబాలుఁ డంగదునికుతుక నులిమి వానర రాజ్యరమను నీరమను నిరాటంకముగ నేలుకొనుము. సుగ్రీవా! నీకన్నులిప్పుడు చల్లఁబడినవా? " యనియామె నిష్ఠురోక్తులాడెను.

చెట్టుక్రింద నిలిచియుండు రాఘవు లామెకంటఁబడిరి. ఆమెకోపమున కంతములేకపోయెను. " రామా! నిష్కారణ

ముగ నాపతి నేలచంపితివి? యాతఁడు నీకేమి విషముపోసెను? మహాత్ములగువారు వనితలను వనచరులను జంపుదురా? ఇది దోషమని నీవెఱుంగకుండుట నాయభాగ్య మనుకొనవలయును. ఓనరనాయకా! బొగ్గులకొఱకు సురమహీజమును గాల్చువారుందురా? నీ సుగుణపుంజమంతయు ధరణిజతోఁ బోయెఁగాఁబోలు! ఓరఘువరా! నీవు నాపతి నకారణముగఁ జంపి నామంగళసూత్రమును ద్రెంపితివి. నాచిన్నియంగదునిఁ దండ్రిలేనిబిడ్డఁజేసితివి! ఈపాపము నిన్నుఁ దగులక మాను ననుకొంటివా? నేను బతివ్రతను నాశాపము నీకుఁ దగులక పోదు. నీవిప్పు డాలింగోల్పడి వగలం బొగులుచున్నాఁడవు రావణుని వధించి నీవు సీతఁదోడ్కొని వచ్చిన నామె నీకడఁ బెద్దకాలము నిలువక భూమిఁజొచ్చి పోవుగాక! నాకు భర్తృవియోగము కలుగునట్లు, నీకు భార్యావియోగము కలుగుంగాక!" యని యామె శపించెను.

శాపవాక్యముల నాలించి సౌమిత్రి రౌద్రుఁడయ్యెను. ఏలోకో, యారాజకుమారుని చేయి విల్లుపైవ్రాలెను. క్రుద్ధుఁడగు తమ్ముని రాముఁడుచూచి యాతని చేయిఁబట్టుకొని "సౌమిత్రీ! వనితలనా వధించుట యిది యేమిషని?" యనెను గాని రామానుజుఁడు శాంతింబొందక "యన్నా! యాధూర్తరాలినోటికి బుద్ధిఁజెప్పెద సెలవిమ్మని" పలికెను. రామచంద్రుఁడు తమ్ముని వారించుచు "తమ్ముఁడా! దూరమాలోచిం

వుము పతివ్రతలఁజెనక బ్రహ్మాదులైనఁజాలరు. త్రిమూర్తి స్వరూపుఁడగు మార్తాండుఁడు సైతము వారలకు వెఱచుననఁ నిఁక మనమెంతవారము? పతివ్రతల శాపము రామబాణము కంటె రామానుజశరముకంటె దారుణమైనదని యెఱుంగు ” మని యాతని శాంతపఱచెను.

భార్యాపుత్రుల రోదనముచే వాలికొకింత తెలివి వచ్చెను. ఆతనిగుండె నీరయ్యెను. బాష్పాంబువుల నాతని మోము దొప్పదోఁగుచుండెను. తిన్ననిమెలుంగున నాతఁడు తనరాణిం గాంచి “ దేవీ! దుఃఖింపకుము. ఈవిధమున నా నొసట వ్రాసియుండ సుధాసమానములగు నీహితోక్తులు నాయెడ విషతుల్యములగుటలో వింతయేమున్నది? ఓ రామ భద్రా యిటురమ్ము. ఈచిన్నవాఁడు నాతనయుఁడు. పుడమిఁ బెట్టిన మఱిమెందువిడచినఁ బక్షి తన్నుకొనిపోవునని చిన్ననాఁటి నుండి వీనిఁ గంటిని ఱెప్పవలె సాఁకుచుంటిని. నేను నీశరమున వ్రాలినందుల కింతయైనఁ జింతింపను, నాతారకొఱకుఁ దపింపను గాని వీనికొఱకు మాత్రము వగచుచున్నాను. ఓ కారుణ్యనిధీ! నీవు నాసుతుశోకముడిపి, వీని రక్షింపవేడెదను. ఓభానుజా యిటురమ్ము! తమ్మయ్యా! నాతప్పులు సైరింపుము. ఇఁక నీవు వానరరాజ్యమున కధినాథుఁడవై నీధర్మపత్నిని రుమ నేలుకొనుచుఁ జిరంజీవివై యుండుము. నాకుమారు నంగదుని యౌవరాజ్యమునకుఁ బట్టముగట్టుము. తమ్మయ్యా! యిదిగో

వాలిం జంపుటయగు ” నని తార కన్నీరు మున్నీరుగా నేడ్చుచు వారల ననేకరీతుల బతిమాలుచుండెను.

అందఱును జాతిబొమ్మలరీతి నట్లే నిలిచియుండిరి. రవిసుతుని కన్నులబాష్పజలములు గ్రమ్ముచుండెను. అతఁ డట్లే యేడ్చుచుండెను. ధనము పాపిష్ఠిదికదా? సోదరవధచే నాతని వ్యధదుర్భరమైయుండెను. పాడురాజ్యమునాశించి కొండంత యన్నను జేతులారఁ జంపితినిగదా? యనిత్యములగు భోగముల నాశించి లోకాతీతుఁడగు సోదరుని మట్టుపెట్టితిఁగదా యనుతలంపా వానరేశ్వరునిమదిఁ గలఁచుచుండెను. ప్రపంచమంతయు నాతనికిఁ బాడై కన్పట్టసాగెను. అతం డంత రామునకుఁ బ్రణమిల్లి “ యోరఘుస్వామీ! నీవు మాటనిలుపుకొంటివి చెప్పినయట్లునాకుఁ బ్లవంగరాజ్యమును బ్రసాదించితివికాని వాలిపడుటయుఁ దారబిట్టడలుటయు నంగదు డధిక శోకార్తిఁ దూలుటయుఁజూచి నామనంబిపుడు రాజ్యసుఖముల నొల్లకున్నది యోరామచంద్రా! సిరికిగా నెంతపాపమొనరించితిని నాయన్న లేని సురపదమైననాకువలదు. సోదరుని రుధిరమున నెఱ్ఱగానుండు సింహాపీఠి నేనుగూర్చుండఁజాల. తొంటిపగిది ఋశ్యమూకముఁజేరి కాయగసరులఁ దినుచు మునివృత్తిమై నుండెద ఓరామప్రభూ! యీవరము నా కనుగ్రహింపు. ” మనెను.

తార పరిదేవనములకు నంగదుని రోదనములకు సుగ్రీవుని విలాపములకు రాముఁడు కన్నీటి నాఁపుకొనఁజాలక ‘ స

మీారీ! వీరి నూఱడింపు 'మని హనుమంతునితో నాతఁ డనెను. హనుమంతుఁడు రాఘవునానతి " నోతారామహాదేవీ; యోకీశాధిపా! పుట్టినజీవుఁడు చచ్చుట నిక్కము. బుద్బుదప్రాయమగు నీకాయమున వివేకులు మమత నుంచరు. ఇంతకు నీకపిసార్వభౌముఁడు పుణ్యాత్ముఁడు. రామబాణమున హతుఁడై యీతఁడు స్వారాజ్యముఁ జూఱఁగొనెను. పగవాఁడైనను మూర్ఖచిత్తుఁడైనను పాపాత్ముఁడైన నవసాన సమయమునఁ బరమేశ్వరు నొక్కమారు సంస్మరించినంత మాత్రమున మోక్షపదవినందునన నిఁక నాపరమేశ్వరుఁడగు శ్రీరామపరబ్రహ్మము సాన్నిధ్యమునఁ బ్రాణములు వాసిన యీవానరనాయకుం డెంత పుణ్యాత్ముఁడోకదా? కాన వగపుఁదక్కుఁ " మని బోధించెను. సుధాసమానములగు పావని సరసవాక్యములచే వారికొకింత యూఱటజనించెను.

ప్రాజ్ఞులగు తారాసుగ్రీవులు హనుమ యుపదేశమునకు సంతృప్తులైనందులకు రామభద్రుఁడు ముదమందుచు "రవిపుత్రా! యిఁక నాలస్యమేల? వాలికగ్నిసంస్కారములొనరించి ప్రేతవిధు లాచరింపుము. భానునందనా! ఈబాలిశత్వమువిడిచి, శీఘ్రముగా సర్వకార్యములు నిర్వర్తింపు." మనిచెప్పెను.

## పండ్రెండవ ప్రకరణము.

### సుగ్రీవ పట్టాభిషేకము.

నేఁడే సుదినము సుగ్రీవపట్టాభిషేక మహోత్సవము నేఁడే జరుగనున్నది వానరులకు తీఱికయనుమాటలేదు. ఎల్లరు పట్టాభిషేకసన్నాహములఁ దవిలియుండిరి. తమతమ నిలయములలంకరించి గృహమేధు లాత్మానందమును బ్రకటించుచుండిరి. గృహిణులు గృహాంగణములను ముత్యాల ముగ్గులచే నలంకరించి వానికిఁ దమలేనవ్వులచే శోభఁగలిగించుచుండిరి. రాజమార్గమంతయుఁ దోరణావళులతోడను పతాకశ్రేణులతోడను విరాజిల్లుచుండెను. మార్గమంతయుఁ జిలుకరింపఁబడిన పన్నీరు సువాసనలు గుబాళించుచుండెను. సుగ్రీవపట్టాభిషేకము దమయింటి పెండ్లిగానెంచి పౌరులు మేళతాళముల మునిఁగియుండిరి. ఎచ్చటఁగాంచిన మంగళధ్వానములే- ఎక్కడవీక్షించిన సంగీతరావములే- ఎందవలోకించినను విజయశబ్దములే

జనులు వీథులయందు గుంపులుగట్టి రామసుగ్రీవమైత్రిని వాలివధను దాశరథుల లోకాతీత చారిత్రమును గథలుగాఁ జెప్పుకొనుచుండిరి. కలిమిలేములు కావడికుండలనుటకు సుగ్రీవచారిత్రమే నిదర్శనమని వారువాకొనుచుండిరి. పట్టాభిషేకమునకు శుభముహూర్తము సమీపించుచుండెను. రాజనగరునందు మంగళవాద్యములు మిన్నంటి మ్రోగుచుండెను. ముహూర్తమిదియేకాఁబోలు జయజయసుగ్రీవమహారాజా!

యని పౌరు లుత్సాహమున నఱచిరి.

ఇంతలో సింహద్వారమునుండి మహోత్సవము బయలు దేఱెను. ‘ సుగ్రీవమహారాజు సచివసమేతముగా ఋశ్యమూక మునకు రఘుపుంగవులఁ దోడ్కొనిరా నేగుచున్నాఁడు. దారి తీయుఁడు తొలఁగి నిలువుఁ. ’ డని వారిలో మేధావు లను చుండిరి. అనుచుండఁగనే యుత్సవము వారిని సంమీపించెను. పట్టపుటేనుఁగుపై వానరస్వామియగు సుగ్రీవుఁడు చతురమతి యగు సామీరితోఁగూర్చుండియుండెను. ఆవెనుక వారివారి యోగ్యతల ననుసరించి కపిముఖ్యు లుచితవాహనములపై వచ్చుచుండిరి. అందఱ మోముదమ్ము లానంద వికసితములై యుండెను.

ఇట్లామహోత్సవము నగరమును నిర్గమించిపోయెను. ఋశ్యమూకమూలముఁ జేరినంతనే సుగ్రీవాదులు వాహనము లుదిగిరి. అందఱును పాదచారులై కొండనెక్కి రామలక్ష్మ ణులయొద్దకుఁబోయి వెంటఁదెచ్చిన యుపాయనముల నర్పించి వారలకు నమస్కరించిరి. ఆనంద విరాజితుఁడగురవిసుతుఁగాంచి కృతప్రతిజ్ఞుఁడగు రాముఁడు ముదితుఁడై యాతనిఁ గౌఁగిలించు కొని మన్నించెను. వానరనాయకుఁడు పరమానందము డెంద మున సందడిగొన మరలమరలఁ బ్రణమిల్లుచు

“ఉ. ఆమఘవాత్మజన్ము నొకయమ్మునదిమ్మనఁగూలనేసి నా
భామిని భూమినిచ్చితివి పల్కను బంతముసంఘటిల్లె నీ

వేమికొ అంతలేనికృప నీఋణమెక్రియఁదీర్చుకొందు? నీఁ
కేమనియందు నీమహిమ? యెవ్వరునీసరి రాఘవేశ్వరా!”

సీతాపతి వానరాధిపుగృతజ్ఞతా బుద్ధికి సంతసించుచు
“ ఓవనాటవరా! నీకు శుభంబగుఁగాక. రాజ్యరక్షణ మొనరిం
చుకొనుచు సుఖంబుండుము. మేము మాల్యవంతమున వర్షా
కాలముఁగడపెదము. అనంతరము సీతాన్వేషణకార్యభారము
నీభుజములపై నున్నదిసుమా! ” యనియగ్గించెను.

రాఘవేంద్రుని కృపావిశేషమునకుఁ బవనాత్మజుఁ డు
ప్పొంగి కరములుమోడ్చి “రామప్రభూ! దుర్లభమగు వానర
రాజ్యమును నీయనుగ్రహమున సుగ్రీవుఁ డందఁగలిగెను. ఓభ
క్తచింతామణీ! నినునమ్మినవానికి నాశమెక్కడిది? నీయాన
తిపై నిఁకనీతనికిఁ బట్టాభిషేకము కావలసియున్నది. దేవా
నీవునుగిష్కింధకువిచ్చేసి సుగ్రీవుని వానరరాజుం జేయు” మని
ప్రార్థించెను. అందులకు రామచంద్రుఁడు “పావనీ! నేనుజన
కాజ్ఞ మెయిఁ బదునాల్గేండ్లు కానలయం దుండవలయును. కాన
నేను బట్టణముఁబ్రవేశించుట యుచితముగాదు. సౌమిత్రి వీరి
వెంట నీవు కిష్కింధకుఁబోయి సుగ్రీవునకుఁ బట్టముగట్టి యం
గదుని యువరాజుఁజేయు”మని చెప్పెను.

ఆతమ్ముఁ డాయన్నమాట జవదాఁటునా! లక్ష్మణుఁడు
లేచెను. రఘురామునకు సుగ్రీవాదులు సాఁగిలఁబడి మ్రొక్కిరి.
రాముఁడువారినాశీర్వదించివీడ్కొలిపెను.

మంగళవాద్యములు భూనభోంతరాళములు నిండిచెవులఁ జిల్లులు సేయుచుండెను. సుగ్రీవాదులు రామానుజుని వెంటఁ బెట్టుకొని కొలువుకూటమునకుఁ దిరిగిపోయిరి. పట్టాభిషేక మహోత్సవమును జూడనేతెంచిన పౌరప్రముఖులు సముచితాసనముల నుపవిష్టులైయుండిరి. హేమసింహాసనము వేదికపైఁ దూర్పు మొగముగా నమర్పఁబడియుండెను శుభముహూర్తమునకు సమముగ వానరనాయకుఁడు నిజపత్నియగు రుమతో సింహాపీఠి నాసీనుఁడయ్యెను. పుణ్యనదీ జలములచేఁ బురోహితులు వానరేశ్వరు నభిషేకించిరి. పట్టాభిషిక్తుఁడైన సుగ్రీవునకు హేమదంత మండితమైన ధవళచ్ఛత్రమును బవనాత్మజుఁడు పట్టెను. కనకరత్నమయములగు చామరములను నలుఁడు, తారుఁడు వీవం దొడంగిరి. యువరాజగు నంగదుఁడు సింహాపీఠికిఁ గుడిభాగమున, బంగారు గద్దియపైఁ గూర్చునియుండెను. వల్కలాజినధారియగు రామానుజుఁడొకయెడ నాసీనుఁడయ్యె. సుగ్రీవుఁ డాతనికి నడకువ నమస్కరించెను. 'సర్వేజనా స్సుఖినోభవం' తని భూదేవులు దీవించిరి.

"క. భూపాగ్రణియగు రాముని
ప్రాపునఁ గపిరాజ్యపట్టభద్రుండై చా
రాపరిణతుఁడై కిష్కిం
ధాపట్టణమేలుచుండెఁ దపనజుఁడెలమిన్"

ఓం శాంతిః శాంతిః శాంతిః.